జిల్లాకు ముగ్గురు ఎన్నికల పరిశీలకుల నియామకం

వీరంతా ప్రజలకు అందుబాటులో..

- ఎన్నికల అంశాలపై ఫిర్యాదులు అందించవచ్చు
- జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి వెల్లడి



ఎన్నికల పరిశీలకులు దల్జీత్‌సింగ్‌మంగత్, మోహన్ ఎం.దహికర్, రాకేశ్‌కుమార్

అనకాపల్లి కలెక్టరేట్, ఏప్రిల్ 25: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో జిల్లాకు ముగ్గురు ఎన్నికల పరిశీలకులు నియమితులయ్యారు. వీరిని గురువారం కలెక్టరేట్‌లో జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. జిల్లాలో సార్వత్రిక ఎన్నికల నిర్వహణ, ముందస్తు ఏర్పాట్ల సంసిద్ధత, ప్రణాళికలపై ఎన్నికల అధికారి రవి పట్టన్‌శెట్టితో వారు చర్చించారు. శాంతి భద్రతల సమస్యలు తలెత్తకుండా ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేందుకు తీసుకుంటున్న చర్యలపై ఎస్పీ కేవీ మురళీకృష్ణ వారికి వివరించారు. నర్సీపట్నం, మాడుగుల, చోడవరం నియోజకవర్గాలకు దల్జీత్‌సింగ్‌మంగత్, అలాగే పెందుర్తి, అనకాపల్లి, ఎలమంచిలి, పాయకరావుపేట నియోజకవర్గాలకు డాక్టర్ రాకేశ్‌కుమార్ ఎన్నికల పరిశీలకులుగా వ్యవహరించనున్నారు. మోహన్ ఎం.దహికర్ (ఐపీఎస్) జిల్లాలో శాంతిభద్రతల పరిస్థితులు, వాటి పరిరక్షణకు తీసుకుంటున్న ముందస్తు చర్యలపై పర్యవేక్షిస్తారు. వీరంతా జిల్లాలో అందుబాటులో ఉంటారని, ఎన్నికలకు ... మిగతా 4వ పేజీలో

జిల్లాలో సెగలు

- మండుతున్న ఎండలు
- దేవరాపల్లిలో అత్యధికంగా 44.1 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు

అనకాపల్లి, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఎండలు మండి పోతున్నాయి. గురువారం దేవరాపల్లిలో అత్యధికంగా 44.1 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. రావికమతంలో 43.8, కశింకోట, మాకవరపాలెంలో 43.5, రోలుగుంటలో 43.3, గొలుగొండ 42.5, చోడవరం, కె.కోటపాడు, మాడుగులలో 42.3, నర్సీపట్నంలో 42.2, బుచ్చెయ్యపేటలో 41.3, చీడికాడలో 41.1 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. మరో రెండు రోజులపాటు ఎండ తీవ్రత ఇదే స్థాయిలో ఉంటుందని వాతావరణ కేంద్రం అధికారులు తెలిపారు.


ముగిసిన నామినేషన్ల స్వీకరణ

అనకాపల్లి లోక్‌సభకు మొత్తం 32 నామినేషన్లు

అసెంబ్లీ స్థానాలకు 140..

- నేడు నామినేషన్ పత్రాల పరిశీలన

అనకాపల్లి, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ ముగిసింది. గురువారం మధ్యాహ్నం 3 గంటలతో లోక్‌సభ, శాసనసభ నియోజకవర్గాలకు నామినేషన్ల స్వీకరణకు గడువు ముగిసింది. శుక్రవారం నామినేషన్‌ల పరిశీలన జరగనుంది. జిల్లాలో అనకాపల్లి లోక్‌సభ స్థానానికి 32 మంది అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు. ఆరు శాసనసభ నియోజవర్గాలకు 140 మంది నామినేషన్లు వేశారు. జిల్లాలో అనకాపల్లి, చోడవరం, నర్సీపట్నం, పాయకరావుపేట, ఎలమంచిలి, మాడుగుల అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఎక్కువ సంఖ్యలో నామినేషన్లు దాఖలయ్యాయి. కొన్ని నియోజకవర్గాల్లో ఒక్కో అభ్యర్థి రెండు నుంచి నాలుగు సెట్లు వరకు నామినేషన్‌లు దాఖలు చేశారు. కాగా పెందుర్తి అసెంబ్లీ స్థానానికి 20 నామినేషన్లు దాఖలయ్యాయి.



చోడవరంలో రిటర్నింగ్ అధికారి చిన్నికృష్ణకు నామినేషన్ పత్రం అందజేస్తున్న టీడీపీ అభ్యర్థి కేఎస్ఎన్ఎస్ రాజు

ఆఖరి రోజు ఇలా..

అనకాపల్లి పార్లమెంట్ స్థానానికి 10

అనకాపల్లి రూరల్: ఆఖరి రోజు అనకాపల్లి పార్లమెంట్ నియోజకవర్గానికి 10 నామినేషన్లు దాఖలయ్యాయి. బీజేపీ అనకాపల్లి ఎంపీ అభ్యర్థి సీఎం రమేశ్ సింగిల్ సెట్ నామినేషన్ దాఖలు చేశారు. అలాగే మిగతా వారు కలెక్టరేట్‌లో జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రవి పట్టన్‌శెట్టికి తమ నామినేషన్లు అందజేశారు.

అనకాపల్లి అసెంబ్లీ స్థానానికి ఐదు

అనకాపల్లి టౌన్: అనకాపల్లి అసెంబ్లీ నియోజకవర్గానికి గురువారం ఐదుగురు అభ్యర్థులు ఎన్నికల రిటర్నింగ్ అధికారికి నామినేషన్ పత్రాలను అందించారు.

నర్సీపట్నంలో మూడు..

నర్సీపట్నం: నర్సీపట్నం అసెంబ్లీ స్థానానికి గురువారం మూడు నామినేషన్లు దాఖలయ్యాయి. ఈ నెల 26 తేదీన 11 గంటలకు రిటర్నింగ్ అధికారి జయరాం నామినేషన్లు పరిశీలిస్తారు. ఈ నెల 29 మధ్యాహ్నం 3 గంటలు వరకు అభ్యర్థులు నామినేషన్లు ఉప సంహకరణకు గడువు ఉన్నట్టు ఆర్వో జయరాం తెలిపారు.

చోడవరంలో..

చోడవరం: చోడవరం అసెంబ్లీ స్థానానికి టీడీపీ అభ్యర్థి కేఎస్ ఎన్ఎస్ రాజు గురువారం నామినేషన్ దాఖలు చేశారు. అలాగే పలువురు అభ్యర్థులు నామినేషన్లు వేశారు.

ఎలమంచిలిలో ఎనిమిది..

ఎలమంచిలి: ఎలమంచిలి అసెంబ్లీ స్థానానికి గురువారం ఎనిమిది మంది అభ్యర్థులు 11 సెట్ల నామినేషన్లు దాఖలు చేశారు.

మాడుగులలో ఏడు..

మాడుగుల రూరల్: మాడుగుల అసెంబ్లీ స్థానానికి గురువారం ఏడు నామినేషన్లు దాఖలయ్యాయి. మాజీ ఎమ్మెల్యే గవిరెడ్డి రామానాయుడు చివరి రోజు స్వతంత్ర అభ్యర్థిగా నామినేషన్ వేశారు.

పాయకరావుపేటలో ఆరు..

నక్కపల్లి: పాయకరావుపేట అసెంబ్లీ స్థానానికి గురువారం ఆరు నామినేషన్లు దాఖలయ్యాయి.

మెయిన్స్‌లో మెరుపులు

విశాఖ విద్యార్థులకు ఓపెన్ కేటగిరీలో 8, 9, 69, 92, 93 ర్యాంకులు

- 500లోపు 100 మందికి ర్యాంకులు
- కార్పొరేట్ కళాశాలల విద్యార్థుల ప్రతిభ



అనిల్‌రెడ్డి 9వ ర్యాంకు | మజ్జి రిషివర్ధన్ 69వ ర్యాంకు | డి.శ్రీనిధి 261వ ర్యాంకు

విశాఖపట్నం, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): జేఈఈ మెయిన్స్‌లో విశాఖ విద్యార్థులు మంచి ప్రతిభ చూపారు. ఈ ఏడాది రెండు పర్యాయాలు నిర్వహించిన మెయిన్స్ పరీక్షలలో వచ్చిన మార్కుల సగటును అనుసరించి ర్యాంకులు విడుదల చేశారు. విశాఖ నగరంలో పలు కార్పొరేట్ కళాశాలల్లో చదివిన విద్యార్థులు జాతీయ స్థాయిలో ఓపెన్ కేటగిరీలో 8, 9 ర్యాంకులు సాధించారు. చింతు సతీష్‌కుమార్ 8 (బీసీ కేటగిరీలో జాతీయ స్థాయిలో 2), రెడ్డి అనిల్ 9, మజ్జి రిషీవర్ధన్ 69 (బీసీ కేటగిరీలో జాతీయ స్థాయిలో 12), ఎం.మణికంఠ పృథ్వీరాజ్ 92, ఎం.సాయిశివలోచన్ 93వ ర్యాంకు తెచ్చుకున్నారు. ఇంకా డి.శ్రీనిధి 261, వై.హర్షవర్ధన్ 267, అల్లు హేమంత్ 277, ఎం.బాలాదిత్య 294, డి.మాధవరావు 373, కె.సంపత్ రాజీవ్ 439, కె.సాయిరాకేష్ 487, బి.సాహితీ 508, బి.తన్మయ్ 587, పి.సృజన్ నారాయణ 649, ఎ.రామలింగనాయుడు 657, ఎ.సాత్విక్ 799, ఎస్.తనూజ్ 815, ఎం.భానుప్రకాష్ 820, ఇ.సృజన 890 ర్యాంకు సాధించారు. కాగా నగరంలో కార్పొరేటర్ కళాశాలలైన శ్రీచైతన్య, నారాయణ, ఫిట్జీ, అసెంట్, శ్రీవిశ్వ, తదితర సంస్థల విద్యార్థులు మంచి ర్యాంకులు సాధించారు. 500లోపు 100 మంది, 1000లోపు 200 మంది ర్యాంకులు తెచ్చుకున్నట్టు కళాశాలల నిర్వాహకులు చెబుతున్నారు.

సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ కావాలని ఉంది



నగరంలోని నారాయణ కళాశాలలో చదువుతున్న చింటు సతీష్‌కుమార్ మెయిన్స్‌లో 8వ ర్యాంకు (ఓపెన్ కేటగిరీ) సాధించాడు. శ్రీకాకుళం జిల్లా పాలకొండకు చెందిన సతీష్‌కుమార్ తల్లిదండ్రులు రమాదేవి, బుచ్చన్న ప్రభుత్వ ఉపాధ్యాయులు. అధ్యాపకులు, తల్లిదండ్రులు సహకారంతో ఈ ర్యాంకు సాధించగలిగానంటున్న సతీష్ జేఈఈ అడ్వాన్స్‌డ్ పరీక్షలో మంచి ర్యాంకు సాధించి ముంబై ఐఐటీలో సీఎస్ఈలో చేరాలనుకుంటున్నట్టు చెప్పాడు. తదుపరి సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా స్థిరపడాలనుకుంటున్నట్టు తెలిపాడు. **- చింటు సతీష్‌కుమార్,** 8వ ర్యాంకు (ఓపెన్ కేటగిరీ)

పేదోడి పొట్టకొట్టిన వైసీపీ

తెలుగుదేశం హయాంలో పట్టణ ప్రాంతాల్లో అన్న క్యాంటీన్లు ప్రారంభం

- జీవీఎంసీ పరిధిలో 25 చోట్ల ఏర్పాటు
- రూ.5కే అల్పాహారం..
- మధ్యాహ్నం/రాత్రి భోజనం రూ.5కే
- నాణ్యమైన ఆహారం అందించడంతో క్యాంటీన్లకు విశేష ఆదరణ
- వైసీపీ అధికారంలోకి రాగానే క్యాంటీన్ల మూసివేత
- పేదలు, కూలీల్లో ఆగ్రహం



నర్సీపట్నంలో నిరుపయోగంగా ఉన్న అన్న క్యాంటీన్

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

నిరుపేదల కడుపు నింపేందుకు టీడీపీ ప్రభుత్వం ఏర్పాటుచేసిన అన్న క్యాంటీన్లపై వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కక్ష గట్టింది. అధికారంలోకి వచ్చిన వెంటనే వాటిని మూసివేయించింది. రూ.5కు అన్నం పెట్టిన క్యాంటీన్లను నిర్దాక్షిణ్యంగా మూసివేయించడం దారుణమంటూ వైసీపీ ప్రభుత్వంపై పేదలు, కూలీలు ఆగ్రహంతో ఉన్నారు.


జీవీఎంసీ పరిధిలో ఏర్పాటుచేసిన అన్న క్యాంటీన్లు	25
ఉదయం టిఫిన్	రూ.5
మధ్యాహ్నం భోజనం	రూ.5
మధ్యాహ్నం భోజనం	రూ.5
ప్రతీరోజూ అల్పాహారం చేసినవారి సంఖ్య	10 వేలు
ప్రతీరోజూ మధ్యాహ్నం భోజనం చేసినవారి సంఖ్య	15 వేల మంది
ప్రతీరోజూ రాత్రి భోజనం చేసేవారి సంఖ్య	10వేలు

పట్టణ ప్రాంతాల్లోని నిరుపేదలు, భవన నిర్మాణ కూలీలు, తదితరులకు కేవలం రూ.5కు నాణ్యమైన ఆహారాన్ని అందించేందుకు తెలుగుదేశం ప్రభుత్వం 2018 జూన్ 11న రాష్ట్రవ్యాప్తంగా అన్న క్యాంటీన్లను ప్రారంభించింది. అన్న క్యాంటీన్‌లకు ఆహారాన్ని సరఫరా చేసే బాధ్యతను అక్షయ పాత్ర స్వచ్ఛంద సంస్థకు అప్పగించింది. అన్న క్యాంటీన్‌లో ప్రతిరోజూ ఉదయం ఏదో ఒక అల్పాహారాన్ని రూ.ఐదుకే అందజేసేవారు. అలాగే మధ్యాహ్నం, రాత్రి పూట కూడా నాణ్యమైన భోజనాన్ని రూ.5కే పెట్టేవారు. అనతికాలంలోనే అన్న క్యాంటీన్లకు విశేషమైన ఆదరణ రావడంతో దశల వారీగా జీవీఎంసీ పరిధిలో 25 చోట్ల అన్న క్యాంటీన్లను ఏర్పాటుచేశారు. వీటన్నింటికీ పక్కా భవనాలు కట్టించి భోజనం చేసేవారికి సౌకర్యంగా ఉండేందుకు కుర్చీలు, టేబుళ్ల వంటి సదుపాయాలు కల్పించారు. భవన నిర్మాణ కూలీలు, రిక్షావాలాలు, ఆటోడ్రైవర్లు, నిరుపేదలు, ఉద్యోగ శిక్షణ కోసం నగరంలో ఉండే పేద విద్యార్థులు క్యాంటీన్లలో ఆకలి తీర్చుకునేవారు. విశాఖ పరిధిలో ప్రతి రోజూ సగటున పది వేల మంది అల్పాహారం, 15 వేల మంది మధ్యాహ్నం భోజనం, పది వేల మంది రాత్రి భోజనం చేసేవారు. కూలీలు, చిరుద్యోగులు, అల్పాదాయ వర్గాలకు తక్కువ ధరకే నాణ్యమైన ఆహారం సమకూరడంతో ఖర్చులు తగ్గి ఆర్థికంగా కొంత వెసులుబాటు కలిగేది. అయితే 2019 ఎన్నికల్లో వైసీపీ అధికారంలోకి రావడంతో అన్న క్యాంటీన్లను మూసివేయించింది. అన్నక్యాంటీన్ల పేరు మార్చాలని మొదట్లో వైసీపీ నేతలు భావించినా, వాటిపై టీడీపీ ముద్ర తొలగిపోదనే ఉద్దేశంతో శాశ్వతంగా మూసివేయించారనే విమర్శలు వెల్లువెత్తాయి. అన్న క్యాంటీన్లకు ప్రత్యామ్నాయంగా అంతకంటే మెరుగ్గా ఉండేలా 'ఆహా క్యాంటీన్ల'ను ఏర్పాటుచేస్తామని వైసీపీ నేతలు ప్రకటించినా, ఐదేళ్లయినా కార్యరూపం ... మిగతా 4వ పేజీలో



అనకాపల్లి రైల్వేస్టేషన్ వద్ద నిరుపయోగంగా ఉన్న అన్న క్యాంటీన్ భవనం

అన్న క్యాంటీన్లు మూసివేయడం సరికాదు



అన్న క్యాంటీన్లు మూసివేయడం వల్ల చాలామంది పేదలు, రిక్షా కార్మికులు, కూలీలు ఇబ్బందులు పడుతున్నారు. ఐదు రూపాయలకే రుచికరమైన భోజనం అప్పట్లో అందుబాటులో ఉండేది. క్యాంటీన్లు మూసివేసిన తరువాత వివిధ పనులపై పట్టణానికి వచ్చే వారు, కార్మికవర్గం, హోటల్‌లో భోజనం చేయాలంటే రూ.70 నుంచి 80లు ఖర్చు చేయాల్సి వస్తుంది. రిక్షా కార్మికులు, చిల్లర వర్తకులకు భోజనం భారంగా మారింది. నిత్యావసర వస్తువుల ధరలు భారీగా పెరగడంతో కడుపు నింపుకోవడానికి కూడా ఇబ్బంది పడాల్సి వస్తుంది.

- ఎం. వీరభద్రరావు, బాలాజీరావు పేట, అనకాపల్లి

నిండా ముంచారు..

గత ఎన్నికల సమయంలో వైసీపీ నాయకుల మాటలు విని మోసపోయిన మత్స్యకారులు

- ఫార్మా వ్యర్థ జలాలను సముద్రంలో విడిచి పెట్టడంపై గతంలో వ్యతిరేకత
- టీడీపీ ప్రభుత్వ హయాంలో ప్రతి కుటుంబానికి పరిహారం ఇవ్వాలని నిర్ణయం
- తాము అధికారంలోకి వస్తే భారీగా పరిహారం ఇస్తామని హామీ ఇచ్చిన వైసీపీ నేతలు
- వారి మాటలు నమ్మి 1200 మంది పరిహారం తీసుకోని వైనం
- ఐదేళ్లుగా ఆ ఊసే ఎత్తని నేతలు
- ఆందోళనలు చేస్తున్నా పట్టించుకునే వారు కరువు
- బాధితులు గగ్గోలు
- ఫిషింగ్ హార్బర్ నిర్మిస్తామని హామీ ఇచ్చి పునాది రాయి కూడా వేయని పరిస్థితి



అచ్యుతాపురంలో ఏర్పాటు చేసిన ఈటీపీ

అచ్యుతాపురం, ఏప్రిల్ 25:

వైసీపీ నాయకుల మాటలు విని పూడిమడక మత్స్యకారులు నిలువునా మునిగారు. నాడు వైసీపీ నాయకుల మాటలు విని పరిహారం తీసుకోని మత్స్యకారులు ఇప్పుడు బాధపడుతున్నారు. ఐదేళ్లుగా భారీ స్థాయిలో ఆందోళనలు చేసినా పట్టించుకొనే నాథుడు కరువయ్యాడు. తాము అధికారంలోకి వచ్చిన వెంటనే ఫిషింగ్ హార్బర్ నిర్మిస్తామని హామీ ఇచ్చినా ఇప్పటి వరకు పునాది రాయి కూడా పడలేదు.

అచ్యుతాపురం, రాంబిల్లి మండలాల పరిధిలో ప్రత్యేక ఆర్థిక మండలి ఏర్పాటు చేయడంతో భారీ స్థాయిలో పరిశ్రమలు వచ్చాయి. ఇందులో ఫార్మా కర్మాగారాలే అధికంగా ఉన్నాయి. ఈ కర్మాగారాల ద్వారా విడుదలైన వ్యర్థాలను శుద్ధి చేసిన అనంతరం పూడిమడక సముద్ర తీరంలో కలపడానికి అధికారులు పూడిమడకకు సుమారు రెండు కిలోమీటర్ల దూరంలో ఎఫ్ల్యుయెంట్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ (ఈటీపీ)ను ఆరేళ్ల క్రితం ప్రారంభించారు. వ్యర్థ జలాలను శుద్ధి చేసి సముద్రంలో కలపడానికి పైపులైన్ ఏర్పాటు చేశారు. అయితే వ్యర్థాలను ఎంత శుద్ధి చేసినా ఆ జలాలు సముద్రంలో కలిస్తే మత్స్య సంపద నశిస్తుందని పూడిమడక మత్స్యకారులు అప్పట్లో భారీ స్థాయిలో ఆందోళన చేశారు. దీంతో అప్పటి తెలుగుదేశం ప్రభుత్వం పలుమార్లు అప్పటి ఉమ్మడి జిల్లా కలెక్టర్, మత్స్యకారులతో పలుమార్లు సమావేశమై ఒక ఒప్పందానికి వచ్చారు. పూడిమడకలో రేషన్ కార్డు ఉన్న ప్రతి కుటుంబానికి రూ.1.25 లక్షలు పరిహారం ఇవ్వడానికి, అంతేకాకుండా కుటుంబంలో మేజర్లయిన వారికి కూడా రూ.1.25 లక్షలు పరిహారం ఇవ్వడానికి అంగీకారం కుదిరింది. ఈ మేరకు అప్పట్లో సర్వే జరిపి పంచాయతీ పరిధిలో 4,230 మందికి పరిహారం చెల్లించాలని నిర్ధారించారు. అంతేకాక ఎటువంటి అవకతవకలు జరగకుండా నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లోనే జమ చేయాలని నిర్ణయించారు. ఇందుకు బ్యాంక్ అకౌంట్లు కూడా లబ్ధిదారుని పేరున తీసుకోవాలని అప్పట్లో అధికారులు ఆదేశించారు. ఈ ప్రక్రియ జరగడానికి కొంత సమయం పట్టింది. అధికారులు ముందుగా ప్రకటించిన ప్రకారం లబ్ధిదారుల బ్యాంక్ అకౌంట్లకు నగదు జమ చేయడం ప్రారంభించారు. ఈలోగా ఎన్నికల నోటిఫికేషన్ వచ్చింది. తాము గెలిస్తే మత్స్యకార కుటుంబంతో పాటు మేజర్లకు కూడా రూ.5 లక్షల పరిహారం ఇస్తామని వైసీపీ నాయకులు ప్రకటించారు. అలాగే కుటుంబానికి ఒక ఉద్యోగం ఇస్తామని పూడిమడక ఎన్నికల ప్రచార సభలో వైసీపీ నేతలు విజయసాయి రెడ్డి, ఉమ్మారెడ్డి వేంకటేశ్వరరావు స్వయంగా ప్రకటించారు. అలాగే అప్పట్లో స్థానిక ఎమ్మెల్యే కన్నబాబురాజు కూడా తన ప్రచారంలో భాగంగా మత్స్యకారుల ప్యాకేజీలో భారీ స్థాయిలో అవినీతి జరిగిందని, తాను గెలిస్తే టీడీపీ నాయకులు తిన్నదాన్ని కక్కిస్తానని, మిగిలిన వారికి న్యాయం చేస్తానని చెప్పారు. వీరి మాటలు నమ్మిన సుమారు 1200 మంది మత్స్యకారులు పరిహారం తీసుకోలేదు.

హామీ గాలికి..

వైసీపీ నాయకుల మాటలు నమ్మి పూడిమడక మత్స్యకారులు గత అసెంబ్లీ ఎన్నికల్లో వైసీపీకి ఓట్లు వేశారు. అయితే ఎమ్మెల్యేగా గెలిచిన కన్నబాబురాజు మత్స్యకారులకు ఇచ్చిన హామీని ఇప్పటి వరకు నెరవేర్చలేదు. వైసీపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ప్యాకేజీ కోసం మత్స్యకారులు ఆందోళన చేస్తూనే ఉన్నారు. కానీ ఇప్పటి వరకు ఈ సమస్య పరిష్కారం కాలేదు.

పునాది రాయి కూడా పడని ఫిషింగ్ హార్బర్

ఉమ్మడి విశాఖ జిల్లాలో అతి పెద్ద మత్స్యకార్ల గ్రామమైన పూడిమడకలో భారీ స్థాయిలో చేపల ఎగుమతులు జరుగుతాయి. అయితే ఇక్కడ మత్స్యకారులు తమ పడవలు నిలుపుకోవడానికి చోటు లేదని అప్పటి ఎలమంచిలి ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు ద్వారా అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు దృష్టికి తీసుకువెళ్లారు. దీనికి స్పందించిన చంద్రబాబునాయుడు పూడిమడకను పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయడంతో పాటు ఫిషింగ్ హార్బర్‌ను కూడా ఏర్పాటు చేస్తానని ప్రకటించారు. వెంటనే వివిధ సంస్థల ద్వారా సర్వేలు చేయించి పూడిమడకలో ఫిషింగ్ హార్బర్ నిర్మించడానికి అనువుగా ఉందని నివేదికలు రావడంతో రూ.350 కోట్లు మంజూరు చేశారు. పనులు ప్రారంభించే సమయానికి ఎన్నికలు రావడంతో ఫిషింగ్ హార్బర్ ప్రతిపాదన ... మిగతా 4వ పేజీలో

పూడిమడక తీరంలో సముద్రంలోకి పైప్‌లైన్ వేస్తున్న దృశ్యం(ఫైల్)



27న అనకాపల్లి, అల్లూరి జిల్లాల్లో షర్మిల సభలు

- కాంగ్రెస్ జిల్లా నాయకుడు జగతా శ్రీనివాసరావు

చోడవరం, ఏప్రిల్ 25: పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల ఈ నెల 27వ తేదీన అనకాపల్లి, అల్లూరి జిల్లాల్లో పర్యటించనున్నారని కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు, నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థి జగతా శ్రీనివాసరావు తెలిపారు. గురువారం ఆయన ఇక్కడ విలేకరులతో మాట్లాడుతూ పార్టీ ఎన్నికల ప్రచారంలో భాగంగా శనివారం ఉదయం పది గంటలకు పాయకరావుపేట, మధ్యాహ్నం ఒంటి గంటకు పాడేరు, సాయంత్రం నాలుగు గంటలకు అరకులోయ సభల్లో షర్మిల పాల్గొంటారన్నారు. త్వరలోనే చోడవరంలోనూ ఆమె సభ ఉంటుందని వివరించారు. ఈ కార్యక్రమాలను అంతా విజయవంతం చేయాల్సిందిగా ఆయన కోరారు.

13న కార్మికులకు వేతనంతో కూడిన సెలవు

- సహాయ కార్మిక కమిషనర్ వసంతరావు

అనకాపల్లి రూరల్, ఏప్రిల్ 25: సార్వత్రిక ఎన్నికల్లో మే 13న జరగనున్న పోలింగ్ నాడు కార్మికులకు వేతనంతో కూడిన సెలవు మంజూరు చేయాలని కార్మిక శాఖ కమిషనర్ గిరిబాబు ఆదేశాలు జారీ చేసినట్టు నర్సీపట్నం సహాయ కార్మిక కమిషనర్ కె. వసంతరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో ఉన్న కార్మికులందరూ ఓటు హక్కును వినియోగించుకునేందుకు సెక్షన్ 135 బీఆర్‌సీ ప్రకారం వ్యాపార సంస్థలు, దుకాణాలు, వాణిజ్య సముదాయాల యజమానులు వేతనంతో కూడిన సెలవు మంజూరు చేయాలని ఆదేశించారు. యాజమాన్యాలు ఎవరైనా నిబంధనలు ఉల్లంఘించినట్టయితే జరిమానాతో కూడిన శిక్షకు గురికావాల్సి ఉంటుందని ఆయన హెచ్చరించారు.

అట్రాసిటీ కేసుపై డీఎస్పీ విచారణ



విచారణ జరుపుతున్న డీఎస్పీ సత్యనారాయణ

అచ్యుతాపురం, ఏప్రిల్ 25: అట్రాసిటీ కేసుపై పరవాడ డీఎస్పీ సత్యనారాయణ గురువారం చీమలాపల్లిలో విచారణ జరిపారు. గత మంగళవారం చీమలాపల్లిలో జరిగిన అమ్మవారి పండగలో సంప్రదాయ వాయిద్యాలు (డప్పు) వాయించిన మార్లపల్లి చిరంజీవిని అదే గ్రామానికి చెందిన సియాద్రి శ్రీను సక్రమంగా వాయించలేదని కుల దూషణ చేశాడని చిరంజీవి అచ్యుతాపురం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సీఐ బుచ్చిరాజు శ్రీనుపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేశారు. దీనిపై డీఎస్పీ సత్యనారాయణ గురువారం విచారణ జరిపారు.

పీఎం రాష్ట్రీయ బాల పురస్కార్‌కు దరఖాస్తుల ఆహ్వానం

అనకాపల్లి రూరల్, ఏప్రిల్ 25: ప్రధానమంత్రి రాష్ట్రీయ బాల పురస్కార్-2024కు అర్హులైన బాలబాలికల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ఐసీడీఎస్ పీడీ అనంతలక్ష్మి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. భారత ప్రభుత్వ మహిళా అభివృద్ధి శిశుసంక్షేమ శాఖ, సాంస్కృతిక కళలు, క్రీడలు, సమాజసేవ, పాండిత్యం, సాహస రంగాల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన బాలలు పురస్కారాలకు అర్హులన్నారు. ఏడబ్ల్యుఏఆర్‌డీఎస్ డాట్ జీఓవీ డాట్ ఐఎన్ ఇన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు.

సున్నపురాయి సరఫరా కోసం ఆర్ఐఎన్ఎల్‌తో ఎన్టీపీసీ ఒప్పందం



ఒప్పంద పత్రాలను చూపిస్తున్న సింహాద్రి ఎన్టీపీసీ, ఆర్ఐఎన్ఎల్ అధికారులు

పరవాడ, ఏప్రిల్ 25: సున్నపురాయిని సరఫరా చేసేందుకు ఎన్టీపీసీ సింహాద్రితో రాష్ట్రీయ ఇస్పాత్ నిగమ్ లిమిటెడ్ (ఆర్ఐఎన్ఎల్) ఒప్పందం కుదుర్చుకుంది. ఈ మేరకు గురువారం ఎన్టీపీసీ చీఫ్ జనరల్ మేనేజర్(కార్పొరేట్ సెంటర్ ఫ్యూయల్ మేనేజ్‌మెంట్) సురేందర్‌పాల్‌సింగ్‌విర్క్, ఆర్ఐఎన్ఎల్ సీజీఎం (మార్కెటింగ్) రజత్‌ఐచ్ ఒప్పందం పత్రాలను మార్చుకున్నారు. తొమ్మిది లక్షల మెట్రిక్ టన్నుల సున్నపురాయిని ఐదేళ్లలో సరఫరా చేసేందుకు ఒప్పందం కుదుర్చుకున్నారు. ఎన్టీపీసీ బొగ్గు ఆధారిత థర్మల్ ప్లాంట్‌ల్లో ఫ్యూగ్యాస్ డీసల్ఫరైజేషన్ (ఎఫ్‌జీడీ)కు సున్నపురాయి ముడి పదార్థంగా వినియోగించబడుతుందని తెలిపారు. ఈ ఒప్పందం దేశంలోని ఎన్టీపీసీకి చెందిన వివిధ ప్లాంట్‌లకు ఉపయోగపడుతుంది. ఈ కార్యక్రమంలో సింహాద్రి ఎన్టీపీసీ ప్రాజెక్ట్ హెడ్ సంజయ్‌కుమార్ సిన్హా, ఆర్ఐఎన్ఎల్ కమర్షియల్ డైరెక్టర్ డీకే మొహంతి తదితరులు పాల్గొన్నారు.

మాడుగుల నుంచి ఇండిపెండెంట్‌గా గవిరెడ్డి నామినేషన్



నామినేషన్ దాఖలు చేస్తున్న గవిరెడ్డి రామానాయుడు

మాడుగుల రూరల్, ఏప్రిల్ 25 : సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో నామినేషన్ల ఘట్టానికి చివరి రోజు గురువారం మాడుగులలో ఏడు నామినేషన్లు దాఖలయ్యాయి. రిటర్నింగ్ ఆఫీసర్ సత్యవాణికి ఆయా అభ్యర్థులు సంబంధిత పత్రాలను సమర్పించారు. ఇదిలావుంటే, ఇండిపెండెంట్‌గా మాజీ ఎమ్మెల్యే గవిరెడ్డి రామానాయుడు నామినేషన్ దాఖలు చేయడం విశేషం. అలాగే ఇండిపెండెంట్‌గా పైలా ప్రసాదరావు రెండు నామినేషన్ సెట్లు దాఖలు చేశారు. డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు కుమార్తె, వైసీపీ మాడుగుల ఎమ్మెల్యే అభ్యర్థిని ఈర్లె అనూరాధ ఒక సెట్, ముత్యాలనాయుడు భార్య రమణమ్మ మరోసెట్టు దాఖలు చేశారు. కాంగ్రెస్ అభ్యర్థిగా బొడ్డు శ్రీనివాస్, ఇండిపెండెంట్ అభ్యర్థిగా లెక్కల ఈశ్వరరావు నామినేషన్ వేశారు.

అసంపూర్తిగా సమగ్ర బీసీ బాలికల వసతి గృహం

- మారుమూల గ్రామాల బాలికల కోసం ఏర్పాటు
- భవన నిర్మాణాలకు రూ.2 కోట్లు మంజూరు
- చేయించిన ఎమ్మెల్యే బండారు
- ఏడాదిన్నరలో చకచకా పనులు
- ప్రభుత్వం మారడంతో పూర్తిగా ఆగిన పనులు



మండల కేంద్రంలో అసంపూర్తిగా నిలిచిపోయిన బీసీ బాలికల వసతి గృహం

సబ్బవరం, ఏప్రిల్ 25: మండల కేంద్రంలోని ప్రభుత్వ హైస్కూల్ ఆవరణలో ఆరేళ్ల క్రితం నిర్మాణం ప్రారంభించిన సమగ్ర బీసీ బాలికల వసతిగృహం అసంపూర్తిగా నిలిచిపోయింది. మండలంలో ఎస్సీ బాలికల కోసం వసతి గృహం ఉంది. బీసీ బాలుర కోసం రెండు వసతి గృహాలతోపాటు గురుకుల వసతి గృహం ఉన్నాయి. కానీ బీసీ బాలికల కోసం ఎటువంటి వసతి గృహం లేదు. దీంతో ప్రభుత్వ హైస్కూల్‌తోపాటు ప్రభుత్వ జూనియర్ కళాశాల, ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో విద్యాభ్యాసం చేస్తున్న వంగలి, ఎ. సిరసపల్లి, నల్లరేగులపాలెం, నారపాడు, ఎల్లుప్పి, బోదివలస, అంతకాపల్లి, గొల్లలపాలెం తదితర గ్రామాల బీసీ బాలికల కోసం సమగ్ర బీసీ బాలికల వసతిగృహాన్ని మంజూరు చేశారు. ఈ వసతి గృహం భవనాల కోసం అప్పటి పెందుర్తి ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి జిల్లా అధికారులతో మాట్లాడిరూ. 2 కోట్లు మంజూరు చేయించారు. 2018లో భవన నిర్మాణ పనులు స్థానిక ప్రభుత్వ హైస్కూల్ ఆవరణలో యుద్ధప్రాతిపదికన ప్రారంభించారు. మంజూరైన నిధులతో కాంట్రాక్టర్ భవన నిర్మాణం పనులు ఏడాదిన్నరలో పూర్తి చేసి, కొన్ని గదులకు టైల్స్ వేశారు. ఈలోగా ఎన్నికలు రావడంతో రాష్ట్ర ప్రభుత్వం మారిపోయింది. ఇంకా ఎలక్ట్రిఫికేషన్ పనులు, కొంత ఫ్లోరింగ్, టాయ్‌లెట్స్, ఫర్నీచర్ పనులు మిగిలిపోయాయి. కొత్త ప్రభుత్వం వచ్చి ఐదేళ్లు దాటిపోతున్నా నిధులు మంజూరు కాలేదు. దీంతో ఐదేళ్లుగా ఎక్కడ పనులు అక్కడే నిలిచిపోయాయి. ప్రజా ప్రతినిధులు, ఉన్నతాధికారులు స్పందించి వసతిగృహం నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని బీసీ బాలికలు కోరుతున్నారు.

జిల్లాలోని అన్ని స్థానాల్లో కూటమిదే విజయం

- అవినీతి వైసీపీ అంతమే అందరి లక్ష్యం కావాలి
- కూటమి అనకాపల్లి ఎంపీ అభ్యర్థి సీఎం రమేష్



ర్యాలీలో గజమాలతో సీఎం రమేష్, రాజులను సత్కరిస్తున్న కార్యకర్తలు

చోడవరం, ఏప్రిల్ 25: జిల్లాలోని అన్ని స్థానాల్లో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థులదే విజయమని కూటమి అనకాపల్లి ఎంపీ అభ్యర్థి సీఎం రమేష్ స్పష్టం చేశారు. గురువారం చోడవరం టీడీపీ అభ్యర్థిగా కేఎస్ఎన్ఎస్ రాజు నామినేషన్ కార్యక్రమానికి హాజరైన ఆయన కార్యకర్తలనుద్దేశించి ప్రసంగించారు. రాష్ట్రంలో అవినీతి వైసీపీ ప్రభుత్వాన్ని గద్దె దించడమే అందరి లక్ష్యం కావాలని పిలుపునిచ్చారు. వైసీపీకి ఓటేస్తే మన గొయ్యి మనం తవ్వుకున్నట్టేనని ఓటర్లకు సూచించారు. అభివృద్ధి, అవినీతిరహిత పాలన కావాలంటే కూటమి అభ్యర్థులను గెలిపించాలని కోరారు. చోడవరంలో కేఎస్ఎన్ఎస్ రాజును గెలిస్తే ఈ ప్రాంతం ఎంతో అభివృద్ధి చెందుతుందన్నరు. అంతకుముందు పార్టీ శ్రేణులు, అభిమానులు అభ్యర్థులు రమేష్, రాజులను గజమాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు బత్తుల తాతయ్యబాబు, పార్టీ పరిశీలకుడు మూర్తియాదవ్, తెలుగురైతు రాష్ట్ర ఉపాధ్యక్షుడు మల్లునాయుడు, జనసేన నాయకులు పీవీఎస్ఎన్ రాజు, బీజేపీ నాయకులు ఈర్లె శ్రీరామమూర్తి తదితరులు పాల్గొన్నారు.

మే 1న ఇంటింటికీ పింఛను అందేలా ఆదేశాలివ్వండి

- ఈసీ, సీఎస్‌కు లోకసత్తా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు బాబ్జీ లేఖ



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న భీశెట్టి బాబ్జీ

కొత్తూరు, ఏప్రిల్ 25: రాష్ట్ర ప్రభుత్వం ప్రతి నెలా వృద్ధులకు ఇచ్చే పింఛన్లు మే 1న ఇంటింటికీ పంపిణీ చేసేలా రాష్ట్ర ఎన్నికల కమిషన్ ప్రధాన అధికారి ముకేష్‌కుమార్ మీనా సీఎస్‌కు ఆదేశాలు జారీ చేయాలని లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ లేఖ రాశారు. గురువారం జనసేన పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో 66లక్షల మంది పింఛనుదారులు ఉన్నారని, 1.35 లక్షల మంది సచివాలయ సిబ్బంది ఉన్నారని, ఇంటింటికీ పంపిణీ చేయాలనుకుంటే సగటున 440 మంది పింఛనుదారులు ఉంటారన్నారు. వీరికి అదే గ్రామంలో రెండు, మూడు రోజుల్లో సచివాలయం సిబ్బందితో పింఛను ఇప్పించవచ్చునన్నారు. ప్రభుత్వం గత నెలలో సక్రమమైన ఏర్పాట్లు చేయకపోవడంతో రాష్ట్ర వ్యాప్తంగా 33 మంది వృద్ధులు మృతి చెందారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం రాష్ట్రంలో ఎండల తీవ్రత ఎక్కువగా ఉన్నందున పింఛనుదారులను సచివాలయం చుట్టూ తిప్పడం సరికాదన్నారు. పింఛన్ల పంపకాల విషయమై ఎన్నికల సంఘం రాష్ట్ర ప్రభుత్వానికి స్పష్టంగా ఆదేశాలివ్వాలని ఆయన కోరారు.

మద్యం అమ్మకాలపై దృష్టి సారించండి

రాష్ట్రంలో మద్యం అమ్మకాల్లో చాలా మతలబులు జరుగుతున్నాయని లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ అన్నారు. కొన్నిచోట్ల మద్యం కొనుగోలుదారుడి నుంచి డబ్బులు వసూలు చేస్తూ మరికొన్ని చోట్ల కార్డుపై అమ్మకాలు చేస్తున్నారని, బార్లు తెరిచిపెట్టి మద్యం దుకాణాలు మూసివేస్తున్నారని ఆరోపిస్తున్నారన్నారు. నగదు రూపంలో జరుగుతున్న అమ్మకాల వెనుక జరిగే మతలబులపై రాష్ట్ర వ్యాప్తంగా విజిలెన్స్ అధికారులు దర్యాప్తు చేసేలా ఎన్నికల సంఘం తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈసీ, సీఎస్‌లకు రాసిన లేఖను విడుదల చేశారు. ఈ సమావేశంలో టీడీపీ నేత బొలిశెట్టి శ్రీనివాసరావు, పౌరవేదిక ప్రతినిధి కొలసాని రమణ, గిరిజన సంఘంనేత లెంకల విశ్వేశ్వరరావు, పెంటకోట గణేష్ తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ విద్యుత్ వేళలు అమలుచేయాలి

- సబ్‌స్టేషన్ ఏఈ కార్యాలయాన్ని ముట్టడించిన రైతులు



కొరుప్రోలు ఏఈ కార్యాలయాన్ని ముట్టడించిన రైతులు

ఎస్.రాయవరం, ఏప్రిల్ 25: వ్యవసాయానికి ఇచ్చే విద్యుత్ వేళలను కచ్చితంగా అమలుచేయాలని పలువురు రైతులు డిమాండ్ చేశారు. గురువారం కొరుప్రోలు ఉప సర్పంచ్ కొరపాటి గోపాలం ఆధ్వర్యంలో పలు గ్రామాలు రైతులు స్థానిక సబ్‌స్టేషన్ ఏఈ కార్యాలయాన్ని ముట్టడించారు. ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడుతూ సబ్‌స్టేషన్ పరిధిలో వ్యవసాయ బోర్లకు ఇస్తున్న విద్యుత్ వేళలను కొంతకాలంగా సక్రమంగా అమలుచేయడం లేదన్నారు. ఎప్పుడు విద్యుత్ ఉంటుందో.. ఎప్పుడు ఉండదో తెలియని పరిస్థితి నెలకొందన్నారు. ఎండలు ముదురుతున్న ప్రస్తుత పరిస్థితుల్లో పశువులకు తాగునీరు పట్టుకునే అవకాశం కూడా లేకుండా పోయిందని వాపోయారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వ్యవసాయ విద్యుత్ సరఫరాలో కచ్చితమైన సమయాలను పాటించాలని డిమాండ్ చేశారు. లేకుంటే ఆందోళన మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.

ఈదురుగాలుల బీభత్సం

- రావికమతం మండలంలోని పలు గ్రామాల్లో విరిగిపడిన చెట్లు, స్తంభాలు
- విద్యుత్ సరఫరాకు తీవ్ర అంతరాయం





అప్పలమ్మపాలెం, గర్నికంలో నేలకూలిన విద్యుత్ స్తంభాలు

రావికమతం, ఏప్రిల్ 25 : మండలంలో గురువారం ఈదురుగాలులతో భారీ వర్షం కురిసింది. దీంతో పలు గ్రామాల్లో చెట్లు, విద్యుత్ స్తంభాలు నేలకూలాయి. ఉదయం నుంచి ఎండ మండింది. ఇంట్లో ఉన్నా ఉక్కపోత ఆగలేదు. దీనికితోడు వడగాల్పులు మరింత భయపెట్టాయి. సాయంత్రం ఒక్కసారిగా వాతావరణం మారిపోయింది. పెనుగాలులకు మేడివాడ, మట్టవానిపాలెం గ్రామాలలో చింత చెట్టు, మామిడి చెట్టు విరిగాయి. అలాగే గర్నికంలో నాలుగు విద్యుత్ స్తంభాలు విరిగి నేల మట్టమయ్యాయి. గరికన్నంలో ఓ రైతు పశువుల షెడ్‌పై విద్యుత్ స్తంభం పడడంతో షెడ్డు విరిగి ధ్వంసమైంది. ఆ సమయంలో అక్కడ పశువులు లేకపోవడంతో ఎటువంటి ప్రాణనష్టం జరగలేదు. అదే విధంగా అప్పలమ్మపాలెం, పి.కొట్నాబిల్లి, ఆర్.కొత్తూరు, అప్పన్నదొరపాలెం గ్రామాలలోనూ ఒక్కో విద్యుత్ స్తంభం విరిగిపడింది. దీంతో విద్యుత్ సరఫరాలు అంతరాయం ఏర్పడింది. ఏది ఏమైనప్పటికీ వాతావరణం చల్లబడడంతో అంతా సేదదీరారు

బీసీలకు నిధుల్లేని కార్పొరేషన్లు

- బీసీల ఆత్మీయ సభలో విశాఖ ఎంపీ కూటమి అభ్యర్థి శ్రీభరత్



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీభరత్

విశాఖపట్నం, ఏప్రిల్ 25: వైసీపీ ప్రభుత్వం బలహీన వర్గాలను అడ్డంగా మోసగిస్తూ నిధుల్లేని కార్పొరేషన్లను బీసీలకు తగిలించారని బీసీ కులాల నేతలు ఆక్రోశం వ్యక్తం చేశారు. గురువారం సిరిపురం వీఎంఆర్డీఏ చిల్డ్రన్స్ థియేటర్‌లో 56 బీసీ కులాల ఆత్మీయ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా విశాఖ ఎంపీ కూటమి అభ్యర్థి ఎం. శ్రీభరత్ మాట్లాడుతూ బీసీ కులాల మధ్య చిచ్చుపెట్టడానికి జగన్ ప్రభుత్వం ప్రయత్నించిందని ఆరోపించారు. బీసీలను ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయంగా బలవంతులను చేయడమే టీడీపీ లక్ష్యమన్నారు. గ్రామస్థాయి నుంచి రాష్ట్రస్థాయి వరకు బలహీనవర్గాల ఇళ్లకు వెళ్లి అభిప్రాయాలు సేకరించి బీసీ డిక్లరేషన్ రూపొందించినట్టు తెలిపారు. ఇందుకు క్షేత్రస్థాయిలో దాదాపు 850 సమావేశాలు నిర్వహించి, అభిప్రాయ సేకరణ చేశామన్నారు. అలాగే బీసీల అభివృద్ధి కోసం ఐదేళ్లలో బీసీ సబ్‌ప్లాన్ కింద రూ.1.50 లక్షల కోట్లు ఖర్చు చేస్తామన్న హామీతో పాటు స్థానిక సంస్థల్లో 34 శాతం రిజర్వేషన్లు పునరుద్ధరిస్తామన్నారు. టీడీపీ జిల్లా అధ్యక్షుడు గండి బాబ్జీ మాట్లాడుతూ పది పాయింట్లతో రూపొందించిన బీసీ డిక్లరేషన్ ద్వారా బీసీలకు 50 ఏళ్లకే పింఛన్ అందిస్తామన్నారు. తూర్పు కూటమి అభ్యర్థి వెలగపూడి మాట్లాడుతూ ఎన్టీఆర్, చంద్రబాబు హయాంలో బీసీలకు సముచిత స్థానం కల్పించారన్నారు. అనంతరం గణబాబు బీసీ డిక్లరేషన్ అంశాలను, కూటమి రూపొందించిన సూపర్ సిక్స్ పథకాలను వివరించారు. ఎమ్మెల్సీ దువ్వారపు రామారావు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ఎమ్మెల్యే అభ్యర్థులు గణబాబు, వంశీకృష్ణ యాదవ్ పాల్గొన్నారు.

రెండు బైక్‌లు ఢీకొని ఐదుగురికి గాయాలు

పెదబయలు, ఏప్రిల్ 25: రెండు ద్విచక్ర వాహనలు ఎదురెదురుగా ఢీకొనడంతో ఐదుగురు గాయపడ్డారు. స్థానికులు తెలిపిన వివరాలు ప్రకారం... ముంచంగిపుట్టు మండలం సంతవీధి గ్రామానికి చెందిన కిముడు క్రిష్టారావు గురువారం పాడేరు వైపు వస్తుండగా, పెదబయలు నుంచి ఎదురుగా వస్తు మరో వాహనదారుడ్ని చిత్రాయిపుట్టు, తమరడ సమీపంలో ఢీకొన్నారు. దీంతో క్రిష్టారావు తీవ్రంగా గాయపడగా, అదే వాహనంపై ఉన్నఇద్దరు చిన్నారులకు స్వల్పంగా గాయలయ్యాయి. మరో వాహనంపై ప్రయాణిస్తున్న కె.రవి, నాగేశ్వరరావు కూడా గాయపడ్డారు. క్షతగాత్రులకు ప్రైవేటు వాహనంలో పెదబయలు పీహెచ్‌సీ తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం పాడేరు తరలించారు.

క్రైం... crime news

విద్యుదాఘాతంతో లైన్‌మన్ మృతి





ఆర్ఈసీఎస్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న ఉద్యోగులు, సిబ్బంది... (ఇన్‌సెట్‌లో) పీతల శివసూర్యనారాయణ (ఫైల్ ఫొటో)

తుమ్మపాల/కశింకోట, ఏప్రిల్ 25: మండలంలోని చూచుకొండ గ్రామానికి చెందిన ఈపీడీసీఎల్ కాంట్రాక్ట్ జూనియర్ లైన్‌మెన్ పీతల శివసూర్యనారాయణ (35) గురువారం ప్రమాదవశాత్తూ మృతి చెందారు. గ్రామంలో విధులు నిర్వహిస్తుండగా విద్యుత్‌షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందారు. శివసూర్యనారాయణకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. చూచుకొండ గ్రామంలో అగ్రికల్చర్ లైన్ల మరమ్మతులు చేపడుతుండగా ప్రమాదం జరిగినట్టు తోటి ఉద్యోగులు చెప్పారు. ఈయన గత 15 ఏళ్లుగా ఆర్ఈసీఎస్‌లో కాంట్రాక్టు జూనియర్ లైన్‌మెన్‌గా విధులు నిర్వహిస్తూ ఉన్నారని, కాంట్రాక్టు సిబ్బందికి ఇన్సూరెన్స్, పీఎఫ్, ఈఎస్ఐ వంటి సదుపాయాలు లేకపోవడంతో సూర్యనారాయణ కుటుంబం రోడ్డున పడిందని తక్షణమే ప్రభుత్వం ఆదుకోవాలని సహచర ఉద్యోగులంతా డిమాండ్ చేస్తూ కశింకోట ఆర్ఈసీఎస్ కార్యాలయం వద్ద ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా యూనియన్ అధ్యక్షుడు మళ్ల పరదేశినాయుడు, సిబ్బంది గంగరాజు, వెంకట్‌గోవింద, రమణ, చిన్నరాజు, జగదీష్ తదితరులు మాట్లాడుతూ మృతుడి కుటుంబానికి తగిన న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. అలాగే లైన్‌మెన్‌కు ఇన్సూరెన్స్, హెల్త్‌కార్డులు, ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. ఇప్పటి వరకు వేర్వేరు ప్రమాదాల్లో 8 మంది మృతి చెందారని, వారి కుటుంబాలకు తగిన న్యాయం జరగలేదన్నారు. ఆర్ఈసీఎస్‌లో ఉన్నప్పుడు అన్ని విధాలా న్యాయం జరిగేదని, ఏపీఈపీడీసీఎల్‌లో విలీనం చేసిన తరువాత సిబ్బందికి న్యాయం జరగలేదన్నారు. తక్షణమే ఉద్యోగులందరికీ భద్రత కల్పించి మృతి చెందిన వారి కుటుంబాలను ఆదుకోవాలని కోరారు. విద్యుత్ షాక్‌తో మృతి చెందిన పీతల శివసూర్యనారాయణ కుటుంబాన్ని ఆదుకోవాలని జనసేన ఎమ్మెల్యే అభ్యర్థి కొణతాల రామకృష్ణ కోరారు.

వాణిజ్య సముదాయంలో అగ్నిప్రమాదం

- రూ. 20 లక్షల ఆస్తి నష్టం
- కాలిబూడిదైన పూజా సామగ్రి, అయ్యప్పస్వామి, భవానీ భక్తులు ధరించే బట్టలు



అగ్ని ప్రమాదంలో కాలిపోయిన పూజా సామగ్రి, బట్టలు తదితర వస్తువులు

పరవాడ, ఏప్రిల్ 25: స్థానిక సంతబయలు వద్ద గల వాణిజ్య సముదాయ భవనంలో గురువారం తెల్లవారు జామున జరిగిన అగ్ని ప్రమాదంలో రూ.20 లక్షల ఆస్తి నష్టం వాటిల్లింది. ఈ ప్రమాదంలో పూజా సామగ్రి వస్తువులతోపాటు అయ్యప్ప, భవానీ భక్తులు ధరించే బట్టలు, ఇతర వస్తువులు కాలిబూడిదయ్యాయి. వివరాలిలా ఉన్నాయి.

పరవాడ గ్రామానికి చెందిన తేలు చలపతిరావు సంతబయలు వద్ద గల దుకాణ సముదాయ భవనంలో సాయిరాం పూజా స్టోర్స్ అండ్ గిఫ్ట్ అండ్ జనరల్ స్టోర్స్ పేరుతో కొన్నేళ్లుగా వ్యాపారం చేస్తున్నాడు. ఎప్పటిలాగే బుధవారం రాత్రి దుకాణాన్ని మూసివేసి ఇంటికి వెళ్లిపోయాడు. గురువారం తెల్లవారుజామున మూడున్నర గంటల ప్రాంతంలో దుకాణం ముందు ఏర్పాటు చేసిన ఇనుపరేకుల షెడ్డు లోపల నుంచి పొగలు రావడాన్ని కొందరు స్థానికులు గుర్తించారు. వెంటనే ఈ విషయాన్ని షాపు యజమానికి సమాచారమిచ్చారు. షెడ్డుకు సంబంధించిన షట్టర్‌ను పగులగొట్టి లోపలకు వెళ్లేందుకు ప్రయత్నించినప్పటికీ వీల్లేకుండా పోయింది. వెంటనే రాంకీ, అనకాపల్లి అగ్నిమాపక కేంద్రాలకు సమాచారమిచ్చారు. వెంటనే అగ్నిమాపక సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని మంటలు ఆర్పే ప్రయత్నం చేశారు. షెడ్డుకు సంబంధించిన షట్టర్ తెరిచేందుకు వీలు లేకపోవడంతో దాన్ని పగులగొట్టి లోపలకు ప్రవేశించారు. అప్పటికే లోపల వస్తువులన్నీ నామరూపాలు లేకుండా కాలిబూడిదయ్యాయి. భవనం గోడలన్నీ బీటలు వారాయి. భవనం లోపల గదిలో గల కొన్ని పూజా సామగ్రి వస్తువులతోపాటు బట్టలు పాక్షికంగా దెబ్బతిన్నాయి. ప్రమాదం ఎలా జరిగిందన్నది తెలియరాలేదు. అగ్ని ప్రమాదం చోటుచేసుకోవడంతో బాధితుడు చలపతిరావు లబోదిబోమంటున్నాడు. ప్రభుత్వం తమను ఆదుకోవాలని కోరుతున్నాడు. ఇదిలా ఉంటే పరవాడ వీఆర్వో వెంకటేశ్వరరావు సంఘటనా స్థలానికి చేరుకుని బాధితుడు నుంచి వివరాలు సేకరించారు. ప్రమాదానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. అయితే ప్రమాదం విద్యుత్ షార్టు సర్క్యూట్ వల్ల జరిగిందా... లేక ఎవరో కావాలనే నిప్పు పెట్టి ఉంటారనే దానిపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

20 మద్యం బాటిళ్లు స్వాధీనం

ఎస్.రాయవరం, ఏప్రిల్ 25: మండలంలో అడ్డురోడ్డు తిమ్మాపురంలో గురువారం ఒక వ్యక్తి అక్రమంగా 20 మద్యం బాటిళ్లు తరలిస్తుండగా పట్టుకున్నట్టు ఎస్ఐ విభీషణరావు తెలిపారు. గ్రామంలో ప్రభుత్వ మద్యం షాపు దగ్గరలో ఎటువంటి అనుమతులు లేకుండా 20 మద్యం బాటిళ్ళు తరలిస్తుండగా పట్టుకున్నామని, దీనిపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామని ఆయన తెలిపారు.

కశింకోటలో పది సీసాలు...

కశింకోట, ఏప్రిల్ 25: అక్రమంగా మద్యం బాటిళ్లు తరలిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసినట్టు ఏఎస్ఐ పీడీ. సుందరమ్మ తెలిపారు. గురువారం కశింకోటలో సాధారణ తనిఖీ చేస్తుండగా పూసర్లవీధికి చెందిన యల్లపు శ్రీనివాసు గోనె సంచిలో మద్యం ఫుల్ బాటిళ్లు 10 తీసుకువెళ్తుండగా అదుపులోకి తీసుకున్నామని చెప్పారు. ఈ మేరకు అతనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని చెప్పారు.

17 మద్యం సీసాలు పట్టివేత

సబ్బవరం, ఏప్రిల్ 25: మండలంలో 17 మద్యం సీసాలను పోలీసులు పట్టుకున్నారు. వంగలి నుంచి అంతకాపల్లికి బుధవారం రాత్రి తీసుకువెళుతున్న 8 క్వార్టర్ మద్యం బాటిళ్లతో శ్రీకాంత్‌పై కేసు నమోదు చేసినట్టు సీఐ విన్నింటి రమణ తెలిపారు. అతని వద్ద మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నామన్నారు. అదేవిధంగా గుల్లేపల్లిలో గల ప్రభుత్వ మద్యం షాపు పక్కన ఉన్న పాన్‌షాపులో మద్యం అమ్ముతుండగా పట్టుకొని వడిపల శ్రీనును అరెస్టు చేశామన్నారు. అతని వద్ద నుంచి 6 క్వార్టర్ మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. అలాగే పరవాడ మండలం ధర్మారాయుడుపేటకు చెందిన పల్లిని రాజు గురువారం 9 మద్యం బాటిళ్లను తీసుకువెళుతుండగా పట్టుకొన్నట్టు స్థానిక స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో(ఎస్ఈబీ) సీఐ పీడీ ప్రసాద్ తెలిపారు. అతని వద్ద నుంచి మద్యం బాటిల్లు స్వాధీనం చేసుకొన్నామన్నారు. నిందితుడిని అరెస్టు చేసినట్టు చెప్పారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

చికెన్ ధరలు

బ్యాగ్	రూ.లలో
రైతు ధర	113.00
లైవ్ ధర	133.00
విత్ స్కిన్	236.00
స్కిన్ లెస్	246.00

కోడి గుడ్లు (నెక్)

వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	400
విజయనగరం	404
శ్రీకాకుళం	404



సమర్థులకే ఓటు

ఇదీ తొలిసారి ఓటు హక్కు వినియోగించుకోబోతున్న యువత మనోగతం

ప్రజల జీవితాల్లో మార్పులు తెచ్చే నాయకుడు కావాలి

- ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించే నాయకులనే ఎన్నుకుంటాం
- ఉచిత పంపిణీలకు పరిమితమై అభివృద్ధిని పక్కనపెట్టడం సరికాదని వాదన
- కుటుంబ సభ్యులో, బంధువులో చెప్పారని తమ నిర్ణయం మార్చుకోబోమని స్పష్టీకరణ





విశాఖపట్నం, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి)

"పాలకులు ఎవరైనా ప్రజల జీవితాల్లో మార్పు తీసుకువచ్చేలా ఉండాలి. రాష్ట్రాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధి బాట పట్టించాలి. ఉద్యోగ, ఉపాధి అవకాశాలకు ప్రథమ ప్రాధాన్యం ఇవ్వాలి. నాణ్యమైన విద్య, వైద్యాన్ని ఉచితంగా ప్రజలకు అందించాలి. ఇవన్నీ చేయగల సమర్థత ఉన్న నాయకులను ఎన్నుకోవాలి. అప్పుడే రాష్ట్రాభివృద్ధితోపాటు ప్రజల జీవితాల్లోనూ మార్పు సాధ్యమవుతుంది. నా ఓటు అటువంటి సమర్థుడైన నాయకుడికే" అంటున్నాడు తొలిసారి ఓటు వేసేందుకు సిద్ధమవుతున్న నగరానికి చెందిన పట్టభద్రుడు అచ్యుత్‌వర్మ. తొలిసారి ఓటు హక్కు వినియోగించుకుంటున్న ఎంతోమంది యువ ఓటర్లు ఇదే విధమైన అభిప్రాయంతో ఉన్నారు. రాష్ట్రాభివృద్ధికి దిక్సూచిగా వ్యవహరించే నాయకుడిని ఎన్నుకుంటే మేలు జరుగుతుందన్న భావన యువ ఓటర్లలో ఉంది. ఉచిత పథకాలకు ప్రాధాన్యం ఇవ్వకుండా, ప్రజలు కష్టపడి సంపాదించుకునే మార్గాలను చూపించాలని, వృత్తి, ఉపాధి కల్పన మార్గాలపై దృష్టిసారించాలని సూచిస్తున్నారు. ఇప్పటికీ నిరుపేదలకు నాణ్యమైన వైద్యం అందడం లేదని, దీనిపై పాలకులు ఎందుకు దృష్టిసారించలేకపోతున్నారని పలువురు ప్రశ్నిస్తున్నారు. ఐదేళ్లలో రాష్ట్రాభివృద్ధికి ప్రణాళిక, దానికి అనుగుణమైన కార్యాచరణ ముఖ్యమని, ఆ దిశగా పాలకులు ముందుచూపుతో వ్యవహరించాలని యువ ఓటర్లు అభిప్రాయపడుతున్నారు. మరికొద్ది రోజుల్లో ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో తొలిసారి ఓటు వేయబోతున్న యువతీ, యువకుల మనోగతాన్ని తెలుసుకునేందుకు 'ఆంధ్రజ్యోతి' యత్నించింది. వారి అభిప్రాయాలు...

సంక్షేమం, అభివృద్ధికి ప్రాధాన్యమివ్వాలి



నిజాయితీపరులైన ప్రజాప్రతినిధులను ఎన్నుకోవాలి. అప్పుడే అభివృద్ధికి అవకాశం ఉంటుంది. సంక్షేమం, అభివృద్ధిని సమానంగా తీసుకెళ్లేలా పాలకుల ఆలోచన ఉండాలి. అప్పుడే మెరుగైన సమాజాన్ని స్థాపించేందుకు అవకాశం ఉంటుంది. యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించేలా ప్రత్యేక ప్రణాళికలను మేనిఫెస్టోలో పెట్టాలి. యువతకు మేలు చేసే వారిని ఎన్నుకునేందుకు సిద్ధంగా ఉన్నాం. నాణ్యమైన ఉచిత విద్య అందించేందుకు ప్రభుత్వాలు కృషి చేయాలి. వైద్యం కూడా ఉచితంగా అందించాలి. నాణ్యమైన ఉచిత విద్య, వైద్యం అందించే పాలకులను ఎన్నుకునేందుకు ఓటు హక్కును వినియోగించుకుంటాను.

- ఎం.దేవి, డిగ్రీ ఫైనలియర్ విద్యార్థిని

అవినీతి రహిత పాలన అందించేవారికే ఓటు



అవినీతి రహిత పాలన అందించే పాలకులను ఎన్నుకోవాలి. ఇప్పటికీ అనేక ప్రభుత్వ కార్యాలయాల్లో లంచాలు ఇస్తేనేగానీ పనులు జరగడం లేదు. ఇటువంటి వ్యవస్థల్లో మార్పు తీసుకురావాలి. ఆ దిశగా ప్రభుత్వాలు ఎందుకు కృషిచేయడం లేదు. అవినీతికి ఆస్కారం లేని ప్రభుత్వాన్ని ఎన్నుకునేందుకు నేను సిద్ధంగా ఉన్నాను. అటువంటి మంచి నాయకుడిని ఎన్నుకునేందుకు తొలి ఓటును వినియోగించుకుంటాను. బంధువులు చెప్పారనో, కుటుంబ సభ్యులు ఒత్తిడి చేశారనో బలవంతంగా ఎవరికీ ఓటు వేయకూడదు. నా మనసుకు నచ్చిన వ్యక్తికి ఓటేసి గెలిపిస్తాను.

- ఎం.జోగి శివరామ్, డిగ్రీ ఫైనలియర్ విద్యార్థి

ప్రజలకు అందుబాటులో ఉండేవారినే ఎన్నుకోవాలి



స్థానిక సమస్యలపై అవగాహన కలిగిన, ప్రజలకు అందుబాటులో ఉండే నాయకులను ఎన్నుకోవాలి. అప్పుడే అందరికీ మేలు జరుగుతుంది. ప్రజాప్రతినిధులుగా ఎన్నికైన తరువాత ఎంతోమంది ప్రజలకు అందుబాటులో ఉండరు. వారి సమస్యలను పట్టించుకోరు. అటువంటి నేతలకు ఓటుతోనే బుద్ధి చెప్పాలి. ప్రభుత్వాలు కూడా ప్రజలకు ఉపాధి పొందే మార్గాలను చూపించాలి. సంపాదన అవకాశాలను చూపించాలి. అప్పుడే రాష్ట్రం కూడా అభివృద్ధి దిశగా పరుగులు పెడుతుంది. మేనిఫెస్టోల్లో అనేక అంశాలను పేర్కొని..వాటిని అమలు చేయడానికి ఇబ్బందులు పడడం మంచిది కాదు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి, ప్రజల స్థితిగతులను మెరుగుపర్చే కీలక అంశాలపై దృష్టిసారించేలా ప్రభుత్వ ప్రణాళికలు ఉండాలి. అప్పుడే ప్రజలు స్వీయాభివృద్ధి సాధించడంతోపాటు రాష్ట్రం కూడా అభివృద్ధి దిశగా అడుగులు వేస్తుంది.

- కె.మనీషా, డిగ్రీ మూడో ఏడాది విద్యార్థి

ఉపాధి కల్పించే వారికే ఓటు



దేశంలో నిరుద్యోగం పెరిగిపోయింది. ప్రభుత్వాలు వస్తున్నాయి..పోతున్నాయి. కానీ, నిరుద్యోగుల సమస్యలను మాత్రం పట్టించుకోవడం లేదు. చదివిన చదువులకు ఉద్యోగాలు దొరకనప్పుడు..ఈ విద్యా వ్యవస్థ, ప్రభుత్వాలు ఎందుకు. పాలకులకు ముందుచూపు లేకపోవడం వల్లే ఇబ్బందులు ఎదురవుతున్నాయి. పాలకులు ఎవరైనా ఉద్యోగాలు కల్పించేలా ఉండాలి. కొత్త పరిశ్రమలను తీసుకురావాలి. యువతకు పెద్దఎత్తున ఉపాధి అవకాశాలు కల్పించాలి. అటువంటి ఆలోచన చేసే ప్రభుత్వాలకే ఓటు వేస్తాం. ఇప్పటికే ఆ దిశగా నిర్ణయం తీసుకున్నాం. తొలిసారి ఓటు హక్కు వినియోగించుకుంటున్న ప్రతి ఒక్కరిదీ ఇదే మాట.

- కె.విష్ణుప్రియ, డిగ్రీ మూడో ఏడాది విద్యార్థి

ఉచితాలకు కాదు, అభివృద్ధికి ప్రాధాన్యం ఇవ్వాలి



నిరుపేద విద్యార్థులు ఉన్నత చదువులు చదువుకోవడానికి ఇబ్బంది పడాల్సి వస్తోంది. పీజీ ప్రైవేటు కళాశాలల్లో చేయడానికి ఫీజు రీయింబర్స్‌మెంట్స్ ఇవ్వడం లేదు. విద్యా వ్యవస్థలో సమూల మార్పులు తీసుకువచ్చే ప్రభుత్వానికి ఓటేస్తాను. నిరుపేద విద్యార్థులు ఉచితంగా ఉన్నత చదువులు చదువుకునే అవకాశాన్ని ప్రభుత్వాలు కల్పించాలి. ఆ దిశగా చర్యలు తీసుకోవాలి. ఉచితాలకు కాకుండా అభివృద్ధికి ప్రభుత్వాలు ప్రాధాన్యం ఇవ్వాలి. రాష్ట్ర ఆర్థిక వనరులను దృష్టిలో పెట్టుకుని పథకాలను అమలు చేయాలి. అప్పులు చేసి పథకాలు అమలుచేసే విధానానికి పాలకులు దూరంగా ఉండాలి. అటువంటి నేతకు మాత్రమే ఓటు వేస్తాను. - పి.దుర్గ శివమ్, డిగ్రీ సెకండియర్ విద్యార్థి

ఉద్యోగావకాశాలు కల్పించగలిగిన వారికే...



ఎన్నికలలో ఓట్లు వేయించుకొని అధికారంలోకి వచ్చిన తర్వాత చదువుకున్న యువతను నిర్లక్ష్యం చేస్తున్నారు. పాలకులకు ముందుచూపు లేకపోవడం వల్ల యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లేకుండా పోతున్నాయి. అధికారంలో ఉన్న ఏ ప్రభుత్వం అయినా పరిశ్రమలు తీసుకొచ్చి ఉద్యోగ అవకాశాలు కల్పించాలి. త్వరలో జరగబోయే ఎన్నికలలో నా మొదటి ఓటు ఆలోచించి వేస్తాను. - ద్రాక్షారపు గౌతమ్, డిగ్రీ విద్యార్థి, బలిఘట్టం

అప్పులు చేసి పంపకాలు చేయడం సరికాదు



ఏ ప్రభుత్వం వచ్చినా మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట వేయాలి. అభివృద్ధితో పాటు ఉద్యోగాల భర్తీకి ప్రభుత్వాలు ప్రాధాన్యం కల్పించాలి. గ్రామీణ ప్రాంతాల్లో అభివృద్ధికి అధిక ప్రాధాన్యం ఇవ్వాలి. పరిశ్రమలు ఎక్కువ ఏర్పాటు చేయడం ద్వారా యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలి. అప్పుడే రాష్ట్ర అభివృద్ధికి అవకాశం ఏర్పడుతుంది. ప్రభుత్వాలు ఉచితాలకు ప్రాధాన్యం ఇవ్వడం వల్లే ఇబ్బంది కలుగుతోంది. ఇటువంటి వాటికి చెక్ చెప్పాలి. ప్రజల జీవన ప్రమాణాలను పెంచే దిశగా ఆలోచించాలి. అప్పులు చేసి పంపకాలు చేయడం వల్ల రాష్ట్రం ఆర్థికంగా వెనుకబడిపోతుంది. పట్టణాలు, నగరాలకు దీటుగా గ్రామీణ ప్రాంతాల్లోనూ మౌలిక వసతులను అభివృద్ధి చేయాలి. విద్య, వైద్య రంగానికి అధిక ప్రాధాన్యం ఇవ్వాలి. - ఎం.చంద్రలోకేష్, డిగ్రీ ఫైనలియర్ విద్యార్థి

గిరిజన హక్కులకు రక్షణ కల్పించే వారికే...



గిరిజన ప్రాంత ప్రజల హక్కులు, చట్టాల రక్షణకు ప్రాధాన్యం ఇచ్చే నేతలకే ఓటు వేయాలని భావిస్తున్నాను. నాకు తొలిసారిగా ఓటు హక్కును వినియోగించే అవకాశం వచ్చింది. దానిని సక్రమంగా వినియోగించుకోవాలనే ఆలోచనతో ఉన్నాను. ప్రధానంగా గిరిజన ప్రాంత అభివృద్ధి, సంక్షేమంతోపాటు గిరిజనుల హక్కులు, చట్టాలకు రక్షణ కల్పించే నేతకే ఓటు వేస్తాను. యువత, విద్యా వంతులు సైతం కాస్తా ఆలోచించి గిరిజన ప్రాంత అభివృద్ధికి ప్రాధాన్యం ఇచ్చే వారికే ఓటు వేస్తే బాగుంటుందని అభిప్రాయపడుతున్నాను.

- సంతారి గోపాలరాజు, లోచలిపుట్టు గ్రామం, హుకుంపేట మండలం, అల్లూరి జిల్లా



తాయిలాలకు లొంగకూడదు



తాత్కాలిక తాయిలాల కంటే శాశ్వత అభివృద్ధి పథకాలు అమలు చేయగలిగిన సత్తా ఉన్న అభ్యర్థులను ఎన్నుకుంటేనే సమాజానికి మేలు. ఇలాంటి వ్యక్తిత్వం ఉన్న వారికి ఓటు వేయాలి. కార్మిక, కర్షకుల ప్రగతికి సమ ప్రాధాన్యం ఇచ్చే నేతలు అవసరం. పారిశ్రామిక, వ్యవసాయ రంగాలు వెనుకబడితే ఆర్థిక వ్యవస్థలు పతనమవుతాయి.

- తారకరామ్, వ్యవసాయదారుడు, నర్సీపట్నం

ఉపాధికి భరోసా ఇవ్వాలి



నిరుద్యోగ యువతకు ఉపాధికల్పనకు ప్రాధాన్యత ఇచ్చే పార్టీలను, నేతలను ఎన్నుకోవాలి. మోసపూరిత మాటలు, ఉచితం పేరుతో తాయిలాలు మేలు చేయవు. నిరుద్యోగ భృతి ఇస్తామని హామీ ఇచ్చే వారు కావాలి. చట్టసభల్లో సమస్యలు ప్రస్తావించి, పరిష్కరించే సామర్థ్యం ఉన్న వారికి ఓటు వేయాలి. విద్య, వైద్యం ప్రతి ఒక్కరికీ ఉచితంగా అందేలా చర్యలు తీసుకుంటామన్న పార్టీని గెలిపించుకోవడం మంచిది.

- అంగనైని ఆనంద్, విద్యార్థి, అరకు

లౌకికతత్వం అవసరం



ప్రజాస్వామ్యం పటిష్టంగా కొనసాగాలంటే లౌకికతత్వ రాజకీయ పార్టీలనే గెలిపించుకోవాలి. కులమతాలు, వర్గ వైషమ్యాలు రెచ్చగొట్టే పార్టీలతో ప్రమాదం. అన్ని మతాలు, వర్గాలను సమానంగా చూసే పార్టీలతో మేలు జరగక పోయినా కీడు జరగదు. ప్రజాస్వామ్యం, లౌకికతత్వం పదాలు రాజకీయ నేతలు వల్లించడానికి బాగుంటున్నాయి. వాటికి కట్టుబడిన వ్యక్తులు, పార్టీలు తక్కువ. అలాంటి వ్యక్తులను చట్టసభలకు పంపితే అభివృద్ధికి అవకాశం.

- కేఎస్ మల్లీశ్వరి, నవలా రచయిత్రి, విశాఖ

నిజాయితీ కలిగి ఉండాలి



చట్టసభలకు పోటీచేసే అభ్యర్థుల్లో నిజాయితీ కలిగిన వారిని ఎన్నుకోవాలి. పరిశ్రమల స్థాపనకు కృషి చేసే నేతలకు ఓటు వేస్తే నిరుద్యోగ సమస్య తీరుతుంది. మాయమాటలతో కాలక్షేపం చేసేవారిని తిరస్కరించాలి. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటే మంచి పాలన అందుతుంది. లేదంటే మోసపోయి ప్రజలు ఇబ్బందులకు గురవుతారు.

-గుడివాడ శ్రీనివాసరావు, లెక్చరర్, గాజువాక

మీరూ పంపించండి

ఎన్నికల వేడి మొదలయ్యింది. పార్టీలు, అభ్యర్థులు సమరాంగణానికి సిద్ధమవుతున్నారు. ఎటువంటి వారు అధికారంలోకి రావాలని మీరు కోరుకుంటున్నారు? పాలకులు ఎలా ఉండాలనుకుం టున్నారు?, ఏం చేయాలని కోరుకుంటున్నారు? ...అభిప్రాయం ఏదైనా మీ మనసులో మాట మాతో పంచుకోండి. దాన్ని 'ఆంధ్రజ్యోతి' పాఠకుల ముందుంచుతాం. ఇంకెందుకు ఆలస్యం మీ అభిప్రాయాన్ని, ఫోటోతో సహా ఈ నంబరుకు వాట్సాప్ చేయండి.

వాట్సాప్ నంబర్ ... 9848212243

గాజువాకలో విలక్షణ తీర్పు!

ఏ పార్టీకీ రెండోసారి లభించని ఆదరణ

- ఇప్పటి వరకు మూడుసార్లు ఎన్నికలు





చింతలపూడి వెంకటరామయ్య



పల్లా శ్రీనివాసరావు

మినీ ఇండియాగా గుర్తింపు పొందిన నియోజకవర్గం

పారిశ్రామిక వాడగా పేర్గాంచిన గాజువాక నియోజకవర్గానికి ప్రత్యేక స్థానం ఉంది.. దేశంలోని వివిధ ప్రాంతాలకు చెందిన వారు ఇక్కడ నివసిస్తుండడంతో దీనికి మినీ ఇండియాగా కూడా పేరుంది. ప్రస్తుతం ఈ నియోజకవర్గంలోని పలు ప్రాంతాలు పెందుర్తి అసెంబ్లీ నియోజకవర్గంలో ఉండేవి. డీ లిమిటేషన్‌లో భాగంగా 2008లో గాజువాక అసెంబ్లీ నియోజకవర్గం ఆవిర్భవించింది. నియోజకవర్గ పరిధిలో 302 పోలింగ్ కేంద్రాలుండగా 3,23,,671 మంది ఓటర్లు ఉన్నారు. ఇందులో పురుషులు 1,57,787 మంది, 1,55,009, ఇతరులు 13 మంది ఉన్నారు.

గాజువాక అసెంబ్లీ నియోజకవర్గం భారీ, మధ్య, చిన్న తరహా పరిశ్రమలకు నిలయం కావడంతో పారిశ్రామికవాడగా గుర్తింపు పొందింది. విశాఖ ఉక్కు కర్మాగారంతో పాటు, దువ్వాడలో ప్రత్యేక ఆర్థికమండలి, గంగవరం పోర్టు, బీహెచ్‌ఈఎల్ వంటి సుమారు మూడువేల మధ్య, చిన్న తరహా పరిశ్రమలు నియోజకవర్గ పరిధిలోనే ఉన్నాయి. ఈ పరిశ్రమ ద్వారా ప్రభుత్వానికి కోట్లాది ఆదాయం వస్తున్నందున ఆర్థిక రాజధానిగా పేర్గాంచింది. దేశంలో వివిధ రాష్ట్రాల నుంచి ఉద్యోగ, ఉపాధి అవకాశాల కోసం వచ్చిన ఎంతో మంది ఇక్కడ స్థిర నివాసాలు ఏర్పాటు చేసుకున్నారు. ఈ నేపథ్యంలో గాజువాక నియోజకవర్గాన్ని మినీ ఇండియాగా పిలుస్తారు.

నియోజకవర్గ పరిధిలో విభిన్న ప్రాంతాల నుంచి వచ్చి ఇక్కడే స్థిరపడిన ఓటర్లే అధిక శాతం మంది ఉన్నారు. ప్రతి ఎన్నికల్లో వీరి ఓట్లే కీలకంగా మారుతున్నాయి. ఇప్పటి వర కు మూడు పర్యాయాలు ఎన్నికలు జరగ్గా వేర్వేరు పార్టీలకు చెందిన నేతలు ఎమ్మెల్యేలుగా ఎన్నికయ్యారు. తొలిసారి 2009లో జరిగిన ఎన్నికల్లో ప్రజారాజ్యం పార్టీ నుంచి పోటీ చేసిన చింతలపూడి వెంకట్రామయ్య సమీప స్వతంత్ర అభ్యర్థి, ప్రస్తుత వైసీపీ ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డిపై గెలుపొందారు. ఈ ఎన్నికల్లో తిప్పల గురుమూర్తిరెడ్డి కాంగ్రెస్ అభ్యర్థిగా, చందాడ నరసింగరావు సీపీఐఎం అభ్యర్థిగా బరిలో నిలిచా రు. 2014లో జరిగిన ఎన్నికల్లో గాజువాకలో టీడీపీ అభ్యర్థిగా పోటీచేసిన పల్లా శ్రీనివాస్ సమీప వైసీపీ అభ్యర్థి తిప్పల నాగిరెడ్డిపై విజయం సాధించారు. 2019 ఎన్నికల్లో వైసీపీ అభ్యర్థి తిప్పల నాగిరెడ్డి జనసేన రాష్ట్ర అధ్యక్షుడు పవన్ కల్యాణ్‌పై గెలిచారు. ఈ ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థి పల్లా శ్రీనివాసరావు మూడో స్థానంతో సరిపెట్టుకోవాల్సి వచ్చింది కాగా ప్రస్తుత సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థిగా పల్లా శ్రీనివాసరావు, వైసీపీ నుంచి మంత్రి గుడివాడ అమర్‌నాథ్‌ల మధ్య పోటీ జరగనుంది.



తిప్పల నాగిరెడ్డి

● గాజువాక

గాజువాకలో విజేతల వివరాలు

సంవత్సరం	విజేత	సమీప ప్రత్యర్థి	ఓట్ల తేడా
2009	సీహెచ్ వెంకట్రామయ్య	నాగిరెడ్డి	17,907
2014	పల్లాశ్రీనివాసరావు	నాగిరెడ్డి	21,712
2019	తిప్పల నాగిరెడ్డి	పవన్‌కల్యాణ్	16,753

నియోజకవర్గంలో ఓటర్ల వివరాలు

మొత్తం ఓటర్లు	3,23,671
పురుషులు	1,62,434
మహిళలు	1,61,225
ఇతరులు	12

ఓటర్లలో టాప్!

- రాష్ట్రంలోనే ప్రథమం
- జీవీఎంసీ 5, 6, 7 వార్డుల పరిధిలోనే లక్ష మంది ఓటర్లు
- పట్టణ, గ్రామీణ ప్రాంతాల సమ్మిళితం
- పుణ్య క్షేత్రాలు, సందర్శనీయ స్థలాలకు ఆలవాలం
- భీమిలి నియోజకవర్గం ప్రత్యేకం



భీమునిపట్నం నియోజకవర్గానికి రాష్ట్రంలోనే ప్రత్యేక స్థానం ఉంది. ఈ నియోజకవర్గంలో అత్యధికంగా 3,60,507 మంది ఓటర్లున్నారు. విస్తీర్ణంలోనూ పెద్దదిగా గుర్తింపు పొందింది. భీమిలి అర్బన్, మండలంతో పాటు ఆనందపురం, పద్మనాభం మండలాలు, మధురవాడతో దీనికి ప్రత్యేక గుర్తింపు లభించింది. ప్రముఖ సందర్శనీయ స్థలాలు, విద్యా సంస్థలు, పుణ్యక్షేత్రాలు, స్టార్ హోటళ్లు, రిసార్టులు, విశ్వవిద్యాలయాలు, బోధనాస్పత్రులకు ఆలవాలంగా నిలిచింది.

నియోజకవర్గం పరిధిలోని పద్మనాభం మండలం చిన్నాపురం, భీమిలి మండలం బోడమెట్టపాలెం, ఆనందపురం మండలం గండిగుండం వరకూ, అడవివరం, గోపాలపట్నం రైల్వేస్టేషన్ సమీపంలో వున్న ఎల్లపువానిపాలెం గ్రామం కూడా ఈ నియోజకవర్గంలోనే వుండడం విశేషం. అక్కయ్యపాలెం పోర్టు స్టేడియం వెనుకబాగం, బీచ్‌రోడ్‌లో సాగర్‌నగర్, ఎండాడ, మదురవాడ, పీఎం పాలెం ఏరియాలు ఈ నియోజకవర్గంలో ఉన్నాయి. ఇంకా సింహాచలం పుణ్యక్షేత్రం, అనంతపద్మనాభస్వామి, గుడిలోవ రంగనాథస్వామి, భీమిలి శ్రీలక్ష్మీనృసింహస్వామి, రుషికొండ శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయలతో తదితర పుణ్యక్షేత్రాలున్నాయి. గీతం డీమ్డ్ యూనివర్సిటీ, గాయత్రి, సంగివలస అనిల్ నీరుకొండ ఆస్పత్రులతో పాటు పీఎం పాలెం క్రికెట్ స్టేడియం, ప్రముఖ ఇంజనీరింగ్ కళాశాలలు, గంభీరం ఐఐఎం దీని పరిధిలోనివే. రుషికొండ బ్లూ ఫ్లాగ్ బీచ్, సహజసిద్ధ ప్రకృతి సౌందర్యం భీమిలి బీచ్, మంగమారిపేట బీచ్, ఎర్రమట్టిదిబ్బలు, తొట్లకొండ, బావికొండ, పావురాయి కొండ ప్రాచీన బౌద్ధక్షేత్రాలు, అల్లూరి సీతారామరాజు జన్మస్థలం పాండ్రంగి, అశోకుని విజయస్థూపం ప్రతిష్ఠించిన పొట్నూరు, ఐటీ సెజ్, స్టార్ హోటళ్లు, రిసార్టులు, మంగమారిపేట వారిజ ఆశ్రమం, బ్యాంక్ కోలనీ శ్రీ కె.శివానందమూర్తి ఆశ్రమం, సద్గురు ఉమర్ ఆలీషా ఆశ్రమం, సౌరిస్ ఆశ్రమం నియోజకవర్గ ప్రతిష్ఠను ఇనుమడింపజేస్తున్నాయి.

భీమిలి నియోజకవర్గం డేటా

మొత్తం ఓటర్లు:	3,60,507
పురుషులు :	1,76,860
స్త్రీలు :	1,83,632
ఇతరులు :	15
6,772 మంది మహిళా ఓటర్లు అధికం	
85 సంవత్సరాలు దాటిన వారు :	1,808
దివ్యాంగ ఓటర్లు :	3,769
మొత్తం పోలింగ్ స్టేషన్లు :	348
వెబ్ కాస్టింగ్ ఏర్పాటు చేస్తున్న పోలింగ్ స్టేషన్లు:	220
క్రిటికల్ పోలింగ్ స్టేషన్ ఏరియాలు:	86
మండలాలవారీగా ఓటర్ల వివరాలు	
పద్మనాభం :	42,033
ఆనందపురం:	51,224
భీమిలి :	1,01,892
విశాఖ రూరల్:	1,65,358

భీమిలి పరిధి జీవీఎంసీ 5,6,7 వార్డుల్లోనే సుమారు లక్షకు పైగా ఓటర్లున్నారు. అభ్యర్థుల విజయావకాశాలను నిర్దేశించేది వీరే. ఈ వార్డుల్లో ఉద్యోగులు, అక్షరాస్యులు ఎక్కువ. మిథిలాపురి వుడాకాలనీ, రత్నగిరి హౌసింగ్‌బోర్డు కాలనీ, రెవెన్యూకాలనీ, సంపత్‌నగర్, పోర్టుకాలనీ, హెచ్‌పీసీఎల్ లేఅవుట్, సాయిప్రియాగార్డెన్స్, అశోక్‌నగర్, తులసీనగర్ తదితర కాలనీల్లో ప్రభుత్వ, ప్రైవేటు రంగాల్లో పనిచేసే ఉద్యోగులు అధిక సంఖ్యలో ఉన్నారు. వీటితో పాటు స్వతంత్రనగర్ కాలనీ, బింద్రానగర్, ఆర్‌హెచ్‌కాలనీ, సేవానగర్, కె.వన్ కాలనీ, కె.2 కాలనీ, మారికివలస, దివ్యాంగుల కాలనీ ప్రాంతాల్లో రోజువారీ కూలీల సంఖ్య అధికం.

● భీమునిపట్నం/మధురవాడ

వైసీపీ ప్రభుత్వ హయాంలో రాష్ట్రం నాశనం

» జనసేన పార్టీ స్టార్ క్యాంపైనర్ పృథ్వీరాజ్



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న పృథ్వీరాజ్

కొత్తూరు, ఏప్రిల్ 25 : వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఏపీని సర్వనాశనం చేసిందని జనసేన పార్టీ స్టార్ క్యాంపైనర్ పృథ్వీరాజ్ ఆవేదన వ్యక్తం చేశారు. గురువారంబీజేపీ ఎంపీ అభ్యర్థి సీఎం రమేశ్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. గత పదేళ్లుగా జగన్‌తో కాపురం చేశానని, ఆయన విధి, విధానాలు నచ్చకపోవడంతోనే ఆ పార్టీ నుంచి బయటకు వచ్చానని తెలిపారు. జగన్ పాలనలో రాష్ట్రంపై కనీస అవగాహన లేని మంత్రులు ఉండడం అన్యాయమన్నారు. అంబటి రాంబాబు, రోజా వంటి వారికి మంత్రి పదవులు ఇచ్చి రాష్ట్రాన్ని అయోమయంలో పడేశారని ఎద్దేవా చేశారు. అనకాపలి ఎంపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న సీఎం రమేశ్‌ను గెలిపిస్తే ఈ ప్రాంతమంతా అన్ని విధాలా అభివృద్ధి చెందడమే కాకుండా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి బుద్ద నాగజగదీశ్వరరావు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు ద్వారపురెడ్డి పరమేశ్వరరావు, పరుచూరి భాస్కరరావు పాల్గొన్నారు.

దిమిలిలో టీడీపీ, జనసేన నేతల ప్రచారం

రాంబిల్లి, ఏప్రిల్ 25 : మండలంలోని దిమిలిలో గురువారం రాత్రి టీడీపీ, జనసేన మండల అధ్యక్షులు వి.దిన్‌బాబు, పప్పల నూకన్నదొర ,నాయకులు, కార్యకర్తలతో ఇంటింటా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఐదేళ్ల వైసీపీ పాలనలో రాష్ట్రంలో విధ్వంసం జరిగిందని, వైసీపీ నేతల మాయమాటలు మరోసారి మోసపోవద్దని కోరారు. వచ్చేది కూటమి ప్రభుత్వమేనని, చంద్రబాబు ముఖ్యమంత్రి అవుతారన్నారు. జనసేన ఎమ్మెల్యే అభ్యర్థి సుందరపు విజయకుమార్, బీజేపీ ఎంపీ అభ్యర్థి సీఎం రమేశ్‌లను గెలిపించాలని వారు కోరారు. ఈ సందర్భంగా టీడీపీ సూపర్ సిక్స్ పథకాల కరపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచులు శానాపతి నాగేశ్వరరావు, సిగిరెడ్డి శివప్రసాద్, టీడీపీ మండల మహిళా అధ్యక్షురాలు దల్లమ్మదేవి, జనసేన పార్టీ నాయకులు కరణం శ్రీహరి, గొర్లి నానాజీ తదితరులు పాల్గొన్నారు.

కూటమి విజయమే కార్యకర్తల లక్ష్యం

జనసేన పెందుర్తి ఎమ్మెల్యే అభ్యర్థి పంచకర్ల రమేశ్‌బాబు



గండి బాబ్జీని సత్కరిస్తున్న పంచకర్ల రమేశ్‌బాబు

సబ్బవరం, ఏప్రిల్ 25 : రానున్న ఎన్నికల్లో కూటమి విజయమే లక్ష్యంగా కార్యకర్తలు పని చేయాలని జనసేన పెందుర్తి ఎమ్మెల్యే అభ్యర్థి పంచకర్ల రమేశ్‌బాబు అన్నారు. పెందుర్తి నియోజకవర్గం టీడీపీ ఇన్‌చార్జిగా నియమితులైన మాజీ ఎమ్మెల్యే గండి బాబ్జీ అభినందన సభ గురువారం ఇక్కడ జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన పంచకర్ల మాట్లాడుతూ.. అధికారంలో ఉన్నా లేకపోయినా గండి బాబ్జీ కార్యకర్తలకు అండగా నిలబడే మనిషి అన్నారు. బాబ్జీ, బండారు సూచనలతో ముందుకు వెళతానన్నారు. ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులతో మండల, వార్డు స్థాయిలో సమావేశాలు పెట్టేలా బాబ్జీ చర్యలు తీసుకోవాలని కోరారు. అంతకుముందు గండి బాబ్జీ మాట్లాడుతూ.. పదేళ్ల తర్వాత కార్యకర్తలను ప్రత్యక్షంగా కలవడం ఆనందంగా ఉందన్నారు. పార్టీకి, నాయకులకు కార్యకర్తలే పెద్ద అండ అన్నారు. వైసీపీ ప్రజలను ప్రలోభాలకు గురిచేసి ఎన్నికల్లో లబ్ధి పొందేందుకు ప్రయత్నిస్తుందని. కార్యకర్తలు తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. ఎమ్మెల్యే గుర్తు గాజుగ్లాసు, ఎంపీ అభ్యర్థి గుర్తు కమలం ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఆయన సూచించారు. ఎంపీ అభ్యర్థి సీఎం రమేశ్ సోదరుడు రాజేశ్ మాట్లాడుతూ.. బాబ్జీ పెందుర్తి టీడీపీ ఇన్‌చార్జిగా నియమి తులైన తరువాత కార్యకర్తల్లో ఉత్సాహం వచ్చిందన్నారు. తమకు కూడా ధైర్యం వచ్చిందన్నారు. పెందుర్తి నియోజకవర్గంలో ఎమ్మెల్యే అనకాపల్లి ఎంపీ అభ్యర్థుల గెలుపు ఖాయమన్నారు. అనంతరం బాబ్జీని కూటమి నేతలతోపాటు నియోజకవర్గం టీడీపీ నేతలు, నాయకులు ఘనంగా సత్కరించారు. టీడీపీ మండల అధ్యక్షుడు ఎం. మహలక్ష్మీనాయుడు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో పెందుర్తి, పరవాడ టీడీపీ అధ్యక్షులు కరక దేముడు, వియ్యపు చిన్నా, బీజేపీ కన్వీనర్ శ్రీనివాసులునాయుడు, నేతలు భరణికాన బాబూరావు, పైల జగన్నాథరావు, పీలా శ్రీనివాసరావు, గండి దేముడు, తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ పాలనలో ప్రజలకు అన్నీ కష్టాలే

» టీడీపీ అభ్యర్థి వంగలపూడి అనిత



టీడీపీలో చేరిన సారిపల్లివానిపాలెం వాసులు

నక్కపల్లి, ఏప్రిల్ 25: ఐదేళ్లపాటు రాష్ట్ర ప్రజలు నరక యాతన అనుభవించారని, ఈ ఎన్నికల్లో ఎన్‌డీఏ కూటమిని గెలిపించి, రాష్ట్రాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రజలపై వుందని పాయకరావుపేట టీడీపీ అభ్యర్థి వంగలపూడి అనిత అన్నారు. మండలంలోని సారిపల్లివానిపాలెం గ్రామానికి చెందిన 40 కుటుంబాల వారు గురువారం నక్కపల్లిలో అనిత నివాసం వద్ద టీడీపీలోకి చేరారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వచ్చే నెల 13వ తేదీతో రాష్ట్రానికి పట్టిన చీడ వదులుతుందన్నారు. ఎన్‌డీఏ కూటమి అధికారంలోకి రావడం ఖాయమని చెప్పారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు కొప్పిశెట్టి కొండబాబు, కొప్పిశెట్టి వెంకటేశ్, కొప్పిశెట్టి బుజ్జి, కోన అప్పలరాజు,వాసు పాల్గొన్నారు.

ప్రాంగణ నియామకాలలో డైట్ విద్యార్థుల ప్రతిభ

అనకాపల్లి టౌన్, ఏప్రిల్ 25 : స్థానిక దాడి ఇంజనీరింగ్ కళాశాలలో నిర్వహించిన క్యాంపస్ ఇంటర్వ్యూల్లో యాక్సెంచర్ మల్టీ నేషనల్ కంపెనీకి 20 మంది ప్లేస్‌మెంట్ సాధించారు. ఆ కంపెనీ విడుదల చేసిన తొలి విడత జాబితాలో డైట్ కళాశాల విద్యార్థులు 20 మందికి రూ.4.47 లక్షల వార్షిక జీతంతో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా నియమితులయ్యారని ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్. వైకుంఠరావు తెలిపారు. ఈ సందర్భంగా గురువారం నిర్వహించిన అభినందన సభలో ఉద్యోగాలు సాధించిన విద్యార్థులను కళాశాల చైర్మన్ దాడి రత్నాకర్ అభినందించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్. వైకుంఠరావు, ట్రైనింగ్ అండ్ ప్లేస్‌మెంట్ ఆఫీసర్ హేమంత్‌కుమార్, కళాశాల డీన్ అకాడమిక్ డాక్టర్ కె.పార్వతి, అకాడమిక్ కో-ఆర్డినేటర్ కృష్ణనాగ్, వివిధ విభాగాధిపతులు, ప్లేస్‌మెంట్ కో-ఆర్డినేటర్లు పాల్గొన్నారు.

కూరగాయల మార్కెట్‌కు సెలవు రేపు

అనకాపల్లి టౌన్, ఏప్రిల్ 25 : స్థానిక గాంధీ మార్కెట్‌లో నడుస్తున్న కూరగాయల మార్కెట్‌లో శనివారం సెలవు దినంగా ప్రకటించినట్టు గౌరీ హోల్‌సేల్ కూరగాయల వర్తక సంక్షేమ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు సూరిశెట్టి జగ్గ మహేశ్వరరావు, వైఎస్ భద్రం ఒక ప్రకటనలో తెలిపారు. కూరగాయల హోల్‌సేల్ వర్తకుడు కోడూరు వెంకటరావు గత వారంలో మృతి చెందిన కారణంగా మార్కెట్‌కు సెలవు ప్రకటించినట్టు తెలిపారు. ఆ రోజు ఎటువంటి క్రయవిక్రయాలు జరగవన్నారు.

విద్వేషాలను రెచ్చగొట్టేలా మాట్లాడడం సరికాదు

» సీపీఎం జిల్లా కార్యదర్శి లోకనాథం

అనకాపల్లి టౌన్, ఏప్రిల్ 25 : అనకాపల్లి ఎన్నికల ప్రచారంలో కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ విద్వేషపూరిత ప్రసంగం చేయడం తగదని సీపీఎం జిల్లా కార్యదర్శి కె.లోకనాథం ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్నికల్లో తమ ప్రభుత్వం వద్ద ఉన్న అభివృద్ధి ప్రణాళికలు,అజెండాలు వెల్లడించకుండా ఆర్టికల్ 370 రద్దు, రామమందిరం గురించి అభ్యంతరకరమైన వ్యాఖ్యలు చేయడం సరికాదన్నారు. రాష్ట్రానికి సంబంధించి పోలవరం ప్రాజెక్టుకు నిధులు, స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ ఉపసంహరణ ప్రకటన, సొంత గనులు కేటాయింపు వంటి ప్రాధాన్యత అంశాలను విస్మరించారని పేర్కొన్నారు.

వైభవంగా మరిడిమాంబ అమ్మవారి పండుగ

పరవాడ, ఏప్రిల్ 25: రావాడ పంచాయతీ పరిధి జల్లెలపాలెంలో మరిడిమాంబ అమ్మవారి పండుగ గురువారం వైభవంగా జరిగింది. తెల్లవారుజామున ఐదు గంటల నుంచి భక్తులు అమ్మవారిని దర్శించుకుని ముడుపులు, మొక్కుబడులు చెల్లించుకున్నారు. మాజీఎంపీపీలు పైలా జగన్నాథరావు, మాసవరపు అప్పలనాయుడు, అనకాపల్లి ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ కన్నూరి వెంకటరమణ, టీడీపీ మండల అధ్యక్షుడు వియ్యపు చిన్న అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. మధ్యాహ్నం అన్నసమారాధనను ఏర్పాటు చేశారు. సాయంత్రం అనుపోత్సవం నిర్వహించారు.

టెన్త్ మెరికలకు గురువుల అభినందనలు

నక్కపల్లి, ఏప్రిల్ 25: స్థానిక బాలికోన్నత పాఠశాల, పెదబోదిగల్లం జడ్పీ హైస్కూల్‌లో ఈ ఏడాది టెన్త్ పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను గురువారం ఉపాధ్యాయులు అభినందించారు. స్థానిక బాలికోన్నత పాఠశాలల్లో అధిక మార్కులు సాధించిన విద్యార్థులను హెచ్‌ఎం సుందరరావు అభినందించారు. పెదబోదిగల్లం హైస్కూల్‌లో హెచ్‌ఎం సత్యనారాయణ, తెలుగు పండిట్ ఎన్‌వీఎస్ ఆచార్యులు మంచి ఫలితాలు సాధించిన విద్యార్థులను అభినందించి, స్వీట్లు పంపిణీ చేశారు.

నునపర్తిలో ఇంటింటా ప్రచారం

అచ్యుతాపురం, ఏప్రిల్ 25: నునపర్తిలో టీడీపీ, జనసేన, బీజేపీ శేణులు గురువారం ఇంటింటా ప్రచారం చేశాయి. ఎన్నికల్లో సుందరపు విజయకుమార్‌కు గాజుగ్లాస్, బీజేపీ ఎంపీ అభ్యర్థి సీఎం రమేశ్‌కు కమలంపై ఓటువేసి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ చుక్క అనూరాధ, టీడీపీ నాయకులు రెడ్డి శ్రీను, గొంప నరసింహ నాయుడు, వెన్నెల అప్పలనాయుడు, కూండ్రపు చినబాబు తదితరులు పాల్గొన్నారు.

300 మంది పేదలకు వస్త్రాలు పంపిణీ

రాంబిల్లి, ఏప్రిల్ 25 : మండలంలోని హరిపురంలో 300 మంది పేదలకు టీడీపీ రాష్ట్ర కార్యదర్శి ధూళి రంగనాయకులు వస్త్రాలు పంపిణీ చేశారు. గురువారం తన తల్లి నాగతల్లి జ్ఞాపకార్థం సోదరులు అప్పారావు,పరమేశ్వరరావు, కుటుంబ సభ్యులతో కలిసి రంగనాయకులు పేదలకు వస్త్రాలు, పండ్లు అందజేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ధూళి రమణ, టీడీపీ మండల ఉపాధ్యక్షుడు కోన అప్పలనాయుడు, టీడీపీ నాయకుడు డి.నూకరాజు, మహిళలు పాల్గొన్నారు.

'కూటమి ప్రభుత్వంతోనే రాష్ట్రాభివృద్ధి'

పాయకరావుపేట, ఏప్రిల్ 25 : టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి జరుగుతుందని టీడీపీ పట్టణ అధ్యక్షుడు పెదిరెడ్డి శ్రీను అన్నారు. గురువారం టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి పార్టీల నాయకులు పట్టణంలోని జీవీఆర్‌నగర్, ఆదర్శనగర్ తదితర ప్రాంతాల్లో ఇంటింటికి సూపర్ సిక్స్ పథకాల గురించి ప్రచారం చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు లెక్కల గోవిందు, మలిపెద్ది వెంకటరమణ, జూరెడ్డి ప్రసాద్, సూరా సుబ్రహ్మణ్యం, భాస్కర చౌదరి, దంతులూరి నాగు, సీహెచ్.పేర్రాజు, జనసేన నాయకులు బీఎస్.నారాయణ పాల్గొన్నారు.

'బీజేపీ పాలనలో శతశాతం అభివృద్ధి'

తుమ్మపాల, ఏప్రిల్ 25 : బీజేపీ పాలనలో కార్మిక రంగం శతశాతం అభివృద్ధి చెందుతుందని స్వచ్ఛభారతి భవన నిర్మాణ కార్మికసంఘం నాయకులు భీశెట్టి చంటి, అలమండ శ్రీనివాసరావు పేర్కొన్నారు. గురువారం తుమ్మపాలలో భవన నిర్మాణ కార్మికులతో జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. కార్యక్రమంలో సంఘం సభ్యులు చిరంజీవి, తాతారావు, శివ నాగేశ్వరరావు, సూర్యారావు తదితరులు పాల్గొన్నారు.

దైనందిన జీవితానికి యోగానే సరైన మార్గం

అనకాపల్లి టౌన్, ఏప్రిల్ 25 : దైనందిన జీవితంలో యోగాయే సరైన మార్గమని రాష్ట్ర పతాంజలి యోగా సమితి ఉపాధ్యక్షుడు టీఎస్‌వీ ప్రసాదరావు అన్నారు. గురువారం స్థానిక జార్జిక్లబ్ ఆవరణలో పతాంజలి యోగా సమితి సహా యోగ ఉపాధ్యాయ శిక్షణ శిబిరాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా అందరితో సూర్య నమస్కారాలను చేయించారు. ప్రసాదరావును ఘనంగా సత్కరించారు. పతాంజలి యోగా సమితి అధ్యక్షుడు దొరమ్మనాయుడు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో పలువురు పాల్గొన్నారు.

కూటమి అభ్యర్థుల విజయానికి పనిచేయాలి

జనసేన ఎమ్మెల్యే అభ్యర్థి సుందరపు విజయకుమార్



సమావేశంలో మాట్లాడుతున్న సుందరపు విజయ్‌కుమార్

ఎలమంచిలి, ఏప్రిల్ 25: టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థుల విజయమే లక్ష్యంగా ఆయా పార్టీల శ్రేణులంతా పనిచేయాలని జనసేన అసెంబ్లీ అభ్యర్థి సుందరపు విజయ్‌కుమార్ పిలుపునిచ్చారు. గురువారం స్థానిక జనసేన పార్టీ కార్యాలయంలో మునిసిపాలిటీ, మండలంలో పార్టీ నేతలు, కార్యకర్తలతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సుందరపు మాట్లాడుతూ కూటమి పార్టీల పట్ల ప్రజల్లో ఆదరణ కనిపిస్తుందన్నారు. ప్రజారంజక పాలనే ధ్యేయంగా కూటమి అభ్యర్థులు ముందుకు సాగుతున్నారన్నారు. అనంతరం సమీక్ష సమావేశంలో పార్టీ శ్రేణులు వ్యవహరించాల్సిన విధి విధానాలపై పలు సూచనలు అందించారు. కార్యక్రమంలో కూటమి నేతలు కొఠారు సాంబ, గొర్లె నానాజీ, బొద్దపు శ్రీను, నక్కా శివశంకర్, ఆడారి ఆదిమూర్తి, రమణబాబు, పల్లా సత్యనారాయణ పాల్గొన్నారు.

అచ్యుతాపురంలో.. ఎలమంచిలిలో కూటమి అభ్యర్థులు ఘన విజయం సాధిస్తామని ఎలమంచిలి జనసేన అభ్యర్థి సుందరపు విజయకుమార్ అన్నారు. గురువారం స్థానిక పార్టీ కార్యాలయంలో మడుతూరుకి చెందిన వైసీపీ నాయకులు బలిరెడ్డి చిన్న శ్రీనివాసరావు, నందారపు నారాయణరావు, ఎర్రంశెట్టి రాజు, మాసారపు శివశంకర్‌లతో పాటు పలువురు జనసేన పార్టీలో చేరారు. వీరందరికీ విజయకుమార్ కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈసందర్భంగా విజయకుమార్ మాట్లాడుతూ నియోజకవర్గంలో ఏ గ్రామానికి వెళ్లినా అంతా ఆదరిస్తున్నారన్నారు. ప్రతీ గ్రామం నుంచి భారీ స్థాయిలో వైసీపీ నుంచి చేరికలు జరుగుతున్నాయన్నారు. కార్యక్రమంలో విశాఖ ఉమ్మడి జిల్లాల జనసేన కార్యదర్శి మోటూరు శ్రీవేణి, పాలసంఘం అధ్యక్షుడు శనివాడ ఆనందరావు, ప్రగడ చిననాగేశ్వరరావు, గోవిందపాల్గొన్నారు.

జగన్ అరాచక పాలనకు స్వస్తి పలకాలి

» టీడీపీ అభ్యర్థి వంగలపూడి అనిత



నామవరంలో ప్రచారం నిర్వహిస్తున్న వంగలపూడి అనిత

పాయకరావుపేట రూరల్, ఏప్రిల్ 25 : రాష్ట్రంలో జగన్ అరాచక పాలనకు స్వస్తి పలికేందుకు టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థులను గెలిపించాలని పాయకరావుపేట టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థిని వంగలపూడి అనిత కోరారు. గురువారం మండలంలోని నామవరంలో ఆమె ఇంటింటికి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. రానున్న ఎన్నికల్లో తనకు సైకిల్ గుర్తుపైనా, అనకాపల్లి బీజేపీ ఎంపీ అభ్యర్థి సీఎం.రమేశ్‌కు కమలం గుర్తుపైనా ఓట్లేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. మహిళలు, దళితులు, బీసీలపై దాడులు పెరిగిపోయాయన్నారు. తొలుత నామవరంలో వంగలపూడి అనితకు ప్రజలు బ్రహ్మరథం పట్టారు. అడుగడుగునా మహిళలు హారతులతో స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు పెదిరెడ్డి చిట్టిబాబు, పట్టణ పార్టీ అధ్యక్షుడు పెదిరెడ్డి శ్రీను, నాయకులు చింతకాయల రాంబాబు, గూటూరు శ్రీనివాసరావు, కురందాసు శివ, గొర్ల లక్ష్మీనారాయణ, ఎం.రమాకుమారి పాల్గొన్నారు.

టీడీపీలో చేరిన వైసీపీ ఎంపీటీసీ సభ్యుడు

పాయకరావుపేట : మండలంలోని గోపాలపట్నం వైసీపీ ఎంపీటీసీ సభ్యుడు కలిదిండి సతీష్‌రాజుతోపాటు పలువురు గురువారం టీడీపీలో చేరారు. ఈ సందర్భంగా తెలుగు మహిళ రాష్ట్ర అధ్యక్షురాలు వంగలపూడి అనిత వారందరికీ కండువాలు వేసి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. రానున్న ఎన్నికల్లో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థుల గెలుపునకు కృషిచేయాలని ఆమె పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు పెదిరెడ్డి చిట్టిబాబు, నాయకులు కంకిపాటి వెంకటేశ్వరరావు, గూటూరు శ్రీనివాసరావు, గణపర్తి రాజబాబు, గణపర్తి దొరబాబు, కోనేటి చంద్రమౌళి, అశోక్ చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న పంచకర్ల రమేశ్‌బాబు

కూటమి ప్రభుత్వంతోనే సంక్షేమ పాలన

జనసేన పార్టీ పెందుర్తి నియోజకవర్గ అభ్యర్థి పంచకర్ల రమేశ్‌బాబు

పెందుర్తి, ఏప్రిల్ 25: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే టీడీపీ అధినేత నారా చంద్రబాబునాయుడు హయాంలో రాష్ట్రంలోని ప్రజలందరికీ సంక్షేమ పాలన అందుతుందని జనసేన పార్టీ పెందుర్తి నియోజకవర్గ అభ్యర్థి పంచకర్ల రమేశ్‌బాబు అన్నారు. గురువారం రాత్రి పురుషోత్తపురం, చినముషిడివాడ సత్యానగర్‌లలో ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా పంచకర్ల మాట్లాడుతూ రాష్ట్రంలో అరాచక పాలన సాగుతోందని, సీఎం జగన్ కల్లబొల్లి కబుర్లు చెబుతూ ప్రజలందరినీ మభ్యపెడుతున్నారని విమర్శించారు. ఇకపై జగన్ ఆటలు సాగవన్నారు. ప్యాలెస్‌లో కూర్చుని బటన్ నొక్కి తాయిలాలు ఇచ్చేస్తే ఓట్లు రాలుతాయనుకోవడం అవివేకమన్నారు. త్వరలో జరగనున్న ఎన్నికల్లో వైసీపీకి ప్రజలు బుద్ధి చెప్పి కూటమి అభ్యర్థులను గెలిపించవలసిందిగా ఆయన విజ్ఞప్తి చేశారు. పెందుర్తిలోని సమస్యలపై తనకు పూర్తిగా అవగాహన ఉందని, ఎమ్మెల్యేగా గెలిచాక వాటిని పరిష్కరిస్తామన్నారు. టీడీపీ నేత సేనాపతి శంకరరావు, మాజీ సర్పంచ్ పిల్లల అప్పలనాయుడు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు సేనాపతి వసంత, బల్ల శ్రీనివాసరావు, నాయకులు పిళ్లా జగన్మోహన పాత్రుడు, అయిత సింహాచలం, శ్రీను యాదవ్, పిల్లల శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

వేపగుంట: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక పంచగ్రామాల భూ సమస్య పరిష్కారానికి తొలి ప్రాధాన్యం ఇస్తామని జనసేన పార్టీ పెందుర్తి నియోజకవర్గ అభ్యర్థి పంచకర్త రమేశ్‌బాబు అన్నారు. 94వ వార్డు పరిధిలోని టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తల ఆత్మీయ సమావేశం బుధవారం రాత్రి నాయుడుతోట లక్ష్మి కల్యాణ మండపంలో జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలోని సమస్యలపై తనకు పూర్తిగా అవగాహన ఉందని, అధికారంలోకి రాగానే పంచగ్రామాలు, తాడి తరలింపు, వుడా భూముల సమస్యలను పరిష్కరించకపోతే తన పేరును మార్చుకుంటాన్నారు. కార్యకర్తకు ఏ సమస్య వచ్చినా అర్ధరాత్రి వేళ ఫోన్ చేసినా మాట్లాడతానన్నారు. తాను లోకల్ కాదని కొందరు ప్రచారం చేస్తున్నారని, ప్రజలకు మేలు చేయాలనే తపన, సమస్యల పరిష్కారం కోసం పోరాడే తత్వం తనకు ఉందన్నారు. ప్రత్యేక అతిథిగా హాజరైన 'జబర్దస్త్' ఫేమ్, సినీ నటుడు హైపర్ ఆది మాట్లాడుతూ ఓటును ఎవరూ అమ్ముకోరాదని, తానొక్కడిని ఓటెయ్యకపోతే ఏమవుతుందని భావించరాదన్నారు. ఒక్క ఓటుతో ఐదేళ్ల పాటు సమర్థుడైన నాయకుడిని ఎన్నుకునే అపూర్వ అవకాశాన్ని కోల్పోతారన్నారు. టీడీపీ నాయకుడు బొబ్బర నరసింహం ఆధ్వర్యంలో వైసీపీకి చెందిన పలువురు కార్యకర్తలు వైసీపీలో చేరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ ఫ్లోర్ లీడర్ పీలా శ్రీనివాస్, కార్పొరేటర్ బల్ల శ్రీనివాసరావు, నాయకులు శేశెట్టి అప్పారావు, మామిడి కిరణ్, బొబ్బర నరసింహం, గొంతిన నాగరాజు, పిన్నింటి పార్వతి, తదితరులు పాల్గొన్నారు.



94వ వార్డులో జరిగిన కార్యక్రమంలో మాట్లాడుతున్న పంచకర్ల

ఘనంగా ప్రపంచ మలేరియా దినోత్సవం

అనకాపల్లి టౌన్, ఏప్రిల్ 25 : స్థానిక జిల్లా మలేరియా అధికారి కార్యాలయంలో గురువారం ప్రపంచ మలేరియా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా మలేరియా అధికారి వరహాలదొర మాట్లాడుతూ దోమలను లార్వా దశలోనే నిర్మూలించాలన్నారు. ఇందు కోసం జిల్లాలో వివిధ కార్యక్రమాలు చేపట్టడం జరిగిందన్నారు. ఇందులో భాగంగా ఈనెల 15 నుంచి వచ్చే నెల 15వ తేదీ వరకు గ్రామాల్లో మలేరియా నివారణకు మందు పిచికారీ చేస్తామన్నారు. ఈ సందర్భంగా ఉద్యోగులు మలేరియా నివారణకు కృషి చేస్తామని ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి సహాయ మలేరియా అధికారి పీజేఎంఆర్‌పీ నాయుడు పాల్గొన్నారు.

కశింకోటలో.. ప్రపంచ మలేరియా దినోత్సవం సందర్భంగా గురువారం వైద్యాధికారి తిరుపతిరావు ఆధ్వర్యంలో మలేరియాపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. దోమలు పెరగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ప్రతి శుక్రవారం ఇళ్లల్లో ఉన్న నీటి నిల్వలు తొలగించి డ్రైడే పాటించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది సత్యనారాయణ, పరమానందరావు, రామ్మూర్తి, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఎస్.రాయవరంలో.. మండలంలోని సర్వసిద్ధి పీహెచ్‌సీలో గురువారం వరల్డ్ మలేరియా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. పీహెచ్‌సీ పరిధిలోని అన్ని గ్రామాల్లో వైద్య సిబ్బంది, పాఠశాలల విద్యార్థులు ర్యాలీలు నిర్వహించారు. ఈ సందర్భంగా మలేరియా రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యాధికారులు డాక్టర్ ఎస్‌ఎస్‌వీ.శక్తిప్రియ, డాక్టర్ ఎన్.వాసంతి, డాక్టర్ వీఎన్‌వీఎస్.ప్రసాద్, హెల్త్ సూపర్‌వైజర్ ఎస్‌ఎస్‌వీ.ప్రకాష్, హెల్త్ విజిటర్ వై.సూర్యకుమారి, బీ.ప్రేమ్ కుమార్, జి.కొండబాబు, లిల్లీ తదితరులు పాల్గొన్నారు.

లాలంకోడూరులో 'సుందరపు' కుటుంబ సభ్యులు ప్రచారం



ఎరకన్నపాలెంలో ప్రచారం చేస్తున్న సుందరపు విజయకుమార్, సోదరుడు సతీష్‌కుమార్ సతీమణులు శైలజ, దమయంతి

రాంబిల్లి, ఏప్రిల్ 25 : మండలంలోని లాలంకోడూరు పంచాయతీ పెదయాతపాలెం, ఎరకన్నపాలెం, బ్రహ్మల కాలనీల్లో గురువారం జనసేన ఉత్తరాంధ్ర రాజకీయ వ్యవహారాల ముఖ్యప్రతినిధి సుందరపు సతీష్‌కుమార్, కుటుంబ సభ్యులు సుందరపు శైలజ, సుందరపు దమయంతి, లాలం చందు ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలతో కలిసి ఇంటింటికి వెళ్లి సూపర్ సిక్స్ పథకాలు వివరించారు. ఎలమంచిలి జనసేన ఎమ్మెల్యే అభ్యర్థి సుందరపు విజయకుమార్‌కు గాజుగ్లాసు గుర్తుపైన, అనకాపల్లి బీజేపీ ఎంపీ అభ్యర్థి సీఎం రమేశ్‌కు కమలం గుర్తుపైన ఓటు వేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో రూరల్ జిల్లా జనసేన పార్టీ ప్రధాన కార్యదర్శి మోటూరి త్రివేణి, సర్పంచ్ లాలం రమేష్‌నాయుడు, టీడీపీ నాయకులు లాలం భరత్, లాలం భిరామ్, మాజీ సర్పంచ్ లాలం సత్యప్రసాద్, బీజేపీ మండల అధ్యక్షుడు కారే రాముడు, బీజేపీ రాష్ట్ర నేత ధర్మాల గోవిందరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జగన్‌రెడ్డి తొలగించిన పింఛన్లు పునరుద్ధరిస్తాం

మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద

అనకాపల్లి రూరల్, ఏప్రిల్ 25 : కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే నియోజకవర్గంలో వైసీపీ ప్రభుత్వం తొలగించిన పింఛన్లను పునరుద్ధరిస్తామని మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ అన్నారు. మండలంలోని రేబాక, అక్కిరెడ్డిపాలెం, గోపాలపురంల్లో ఉపాధి హామీ కూలీలతో గురువారం ఆయన సమావేశమయ్యారు. మే 13న జరగనున్న ఎన్నికల్లో బీజేపీ ఎంపీ అభ్యర్థి సీఎం రమేశ్‌కు కమలం గుర్తుపైన, జనసేన ఎమ్మెల్యే అభ్యర్థి కొణతాల రామకృష్ణకు గాజుగ్లాస్ గుర్తుపైన ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు సాలాపు శాంతి, మాటూరి సన్యాసమ్మ, టీడీపీ నాయకులు తలారి కాశీనాయుడు, నారపిన్ని చంద్రశేఖర్ పాల్గొన్నారు.

జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో మంచి ర్యాంక్ సాధిస్తా..

సాహస్ హనుమంతు (ర్యాంకు 901)



మాది అనకాపల్లి మండలం కొండకొప్పాక గ్రామం. నాన్న నేతాజీ గాంధీనగరం జీవీఎంసీ స్కూలులో ఉపాధ్యాయుడిగా పని చేస్తున్నారు. విశాఖ నారాయణ కాలేజీలో చదివాను. నాకు జేఈఈ మెయిన్స్‌లో ర్యాంక్ రావడం ఆనందంగా ఉంది. అడ్వాన్స్‌డ్‌లో కూడా మంచి ర్యాంక్ సాధించి కంప్యూటర్ ఇంజనీర్‌ను అవుతా.

సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌ను అవుతా..

బిక్కి సిద్దార్థ (ర్యాంకు 1104)



మాది అనకాపల్లి మండలం కొత్తూరు శారదానగర్. నాన్న బి.నాగేశ్వరరావు నారాయణ జూనియర్ కాలేజీలో ఏజీఎంగా పని చేస్తున్నారు. నేను విశాఖ నారాయణ కాలేజీలోనే చదివా. అడ్వాన్స్‌డ్‌లో మంచి ర్యాంకు సాధించి సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌ను అవుతా.

ఐఐటీ చేయడమే లక్ష్యం

కట్టమూరి కుషల్, (ర్యాంకు 1125)



మాది ఎలమంచిలి. నాన్న రాజేశ్ ఉపాధ్యాయుడిగా పని చేస్తున్నారు. నేను విశాఖ శ్రీచైతన్య కళాశాలలో చదివా. అడ్వాన్స్‌డ్‌లో మంచి ర్యాంక్ సాధించి ఐఐటీ పూర్తి చేయడమే లక్ష్యం.



పేదోడి పొట్టకొట్టిన వైసీపీ

... 1వ పేజీ తరువాయి

దాల్చలేదు. అయితే తమకు నామమాత్రపు ధరకు నాణ్యమైన ఆహారాన్ని అందించిన అన్న క్యాంటీన్లను రద్దు చేసి తమ కడుపు కొట్టారంటూ వైసీపీ ప్రభుత్వాన్ని నిరుపేదలు ఇప్పటికీ తూర్పారబడుతుంటారు.

వైసీపీ అధికారంలోకి వచ్చిన మూడు నెలలకే మూత

నర్సీపట్నం: వైసీపీ అధికారంలోకి వచ్చిన మూడు నెలలకే అన్న క్యాంటీన్లు మూత పడ్డాయి. నర్సీపట్నం ఏరియా ఆస్పత్రి ఎదురుగా ఉన్న అన్న క్యాంటీన్ భవనం ప్రస్తుతం నిరుపయోగంగా ఉంది. భవనంలో చెత్తాచెదారం పేరుకుపోయింది. చాలా సామగ్రి అపహరణకు గురైంది. గతంలో ఇక్కడ ప్రతీ రోజు అల్పాహారం 350 మందికి, మధ్యాహ్నం భోజనం 350, రాత్రి భోజనం 250 మందికి వడ్డించేవారు. అన్న క్యాంటీన్ ప్రారంభం నాటి నుంచి వైసీపీ ప్రభుత్వం మూసేసే వరకు సెలవు రోజులు పోను అల్పాహారం 54,969 మందికి, మధ్యాహ్నం భోజనం 59,575 మందికి, రాత్రి భోజనం 34,520 మందికి వడ్డించారు.

అనకాపల్లిలో..

అనకాపల్లి టౌన్: టీడీపీ ప్రభుత్వ హయాంలో 2018 జూలై 11వ తేదీన అనకాపల్లి పట్టణంలోని ఎన్టీఆర్ వైద్యాలయం ఆవరణ, రైల్వేస్టేషన్ ప్రధాన మార్గం వద్ద అన్న క్యాంటీన్‌లను ప్రారంభించారు. ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం, రాత్రి ఐదేసి రూపాయల చొప్పున ఆహారం అందుబాటులో ఉండేది. ఇక్కడ ఉదయం 300 నుంచి 350 మంది, మధ్యాహ్నం 500 నుంచి 600 మంది, రాత్రి వేళ 300 నుంచి 400 మంది భోజనాలు చేసేవారు. అలాగే రైల్వేస్టేషన్ వద్ద అన్న క్యాంటీన్‌లో రిక్షా కార్మికులు, దూర ప్రాంతాలకు కూలీ పనులకు వెళ్లే వ్యవసాయ కూలీలు భోజనాలు చేసేవారు. అయితే వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక 2019 ఆగస్టులో అన్న క్యాంటీన్లు మూసివేశారు.

నిండా ముంచిన వైసీపీ

... 1వ పేజీ తరువాయి

మూలన పడింది. తరువాత వచ్చిన వైసీపీ ప్రభుత్వం దీనిని వర్చువల్ పద్ధతిలో మూడుసార్లు శంకుస్థాపన చేసింది. అయితే ఇప్పటి వరకు పునాది రాయి కూడా పడలేదు. అలాగే తాము అధికారంలోకి వస్తే సెజ్ కర్మాగారాల్లో 75 శాతం ఉద్యోగాలు స్థానికులకే ఇస్తామని అప్పట్లో జగన్మోహన్‌రెడ్డి ప్రకటించారు. స్థానికుల మాటెలా ఉన్నా కనీసం నిర్వాసితులకు కూడా ఉపాధి అవకాశాలు కల్పించలేదు. గత ఎన్నికల సమయంలో వైసీపీ మాటలు విని నిండా మునిగామని పూడిమడక మత్స్యకారులతో పాటు నిర్వాసిత రైతులు కూడా ఆవేదన చెందుతున్నారు.

ముగ్గురు ఎన్నికల పరిశీలకుల నియామకం

... 1వ పేజీ తరువాయి

సంబంధించిన ఫిర్యాదులు, వినతులు వారికి సమర్పించవచ్చునని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి తెలిపారు. అనకాపల్లి పట్టణంలోని గుండాల జంక్షన్‌లో గల ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా కేంద్రంలో దల్జీత్‌సింగ్‌మంగత్ అందుబాటులో ఉంటారని కలెక్టర్ తెలిపారు.

మలేరియా రహిత సమాజమే లక్ష్యం కావాలి

▸▸ ప్రపంచ మలేరియా దినోత్సవ ర్యాలీలో వైద్యాధికారులు పిలుపు



దేవరాపల్లి మండలం పినకోటలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది



బుచ్చెయ్యపేట మండలం తురకలపూడిలో...

బుచ్చెయ్యపేట, ఏప్రిల్ 25 : మలేరియా రహిత సమాజమే అందరి లక్ష్యం కావాలని తురకలపూడి పీహెచ్‌సీ వైద్యాధికారిణి సంధ్యారాణి అన్నారు. ప్రపంచ మలేరియా నివారణా దినోత్సవం సందర్భంగా గురువారం ఇక్కడ వైద్య సిబ్బంది నిర్వహించిన అవగాహన ర్యాలీ ప్రారంభోత్సవంలో మాట్లాడారు. వేసవి, వర్షాకాలాల్లో ప్రతి ఒక్కరూ ఆరోగ్య పరిరక్షణకు తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. దోమల ద్వారా మలేరియా, ఫైలేరియా, డెంగ్యూ, మెదడువాపు వ్యాధి, చికెన్ గున్యా వంటివి వ్యాపించే ప్రమాదం ఉన్నందున అప్రమత్తంగా ఉండాలన్నారు. డాక్టర్ సునీల్ మాధవ్, ఫార్మసిస్ట్ ఎస్.చంద్రమౌళి, వైద్య సిబ్బంది, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

దేవరాపల్లి : 'దోమ పుట్టరాదు- దోమ కుట్టరాదు, మలేరియాను పూర్తిగా అరికడదాం..' అంటూ మండలంలోని పినకోట పీహెచ్‌సీ సిబ్బంది గురువారం ర్యాలీ నిర్వహించారు. మలేరియా దినోత్సవం సందర్భంగా వైద్యాధికారులు డాక్టర్ జి.వెంకటేష్, డాక్టర్ డి.రూప్‌చంద్ ఆధ్వర్యంలో సిబ్బంది వీధివీధినా నినాదాలు చేస్తూ అవగాహన ర్యాలీగా ముందుకు సాగారు. ఈ కార్యక్రమంలో ఎంపీహెచ్‌ఈవో గంగరాజు, హెల్త్ ఎడ్యుకేటర్ రవిశర్మ, జి.రమణారావు, సావిత్రి, శ్రీదేవి సిబ్బంది పాల్గొన్నారు.

చీడికాడ : మలేరియా దినోత్సవం సందర్భంగా కోనాం శివారు జాజులపాలెం, గుడివాడ గిరిజన గ్రామాల్లో గురువారం హెల్త్ సూపర్‌వైజర్ జి. వెంకటరావు, కోనాం సబ్‌సెంటర్ హెల్త్ అసిస్టెంట్ పెంటకోట పేరునాయుడులు ఆధ్వర్యంలో ఇంటింటికీ స్ప్రేయింగ్ చేయించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వర్షాల సీజన్‌లో వ్యాధుల పట్ల అంతా అప్రమత్తంగా ఉండాన్నారు. ఈ కార్యక్రమంలో ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

గొలుగొండ/కృష్ణాదేవిపేట : మలేరియా దినోత్సవం సందర్భంగా గొలుగొండ, చీడిగుమ్మల, ఏఎల్‌పురం పీహెచ్‌సీల పరిధిలో గురువారం అవగాహనా ర్యాలీలు నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారులు శ్యామ్‌కుమార్, ధనుంజయ్, గాయత్రి, హరి ప్రవీణ్‌లు మాట్లాడుతూ ఆరోగ్య పరిరక్షణకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆయా పీహెచ్‌సీల సిబ్బంది పాల్గొన్నారు.

రోలుగుంట : ఇక్కడి ఆరోగ్య కేంద్ర సిబ్బంది గురువారం మలేరియా నివారణకు అవగాహన ర్యాలీ నిర్వహించారు. ప్రపంచ మలేరియా దినోత్సవం సందర్భంగా వైద్యాధికారిణి డాక్టర్ ధనలక్ష్మి ఆధ్వర్యంలో చేపట్టిన ఈ ర్యాలీలో వ్యాధులబారిన పడకుండా ప్రజలకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీహెచ్‌ఈవో వై.కృష్ణ, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

నర్సీపట్నం అర్బన్ : ప్రపంచ మలేరియా దినోత్సవం సందర్భంగా వేములపూడిలో గురువారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారిణి డాక్టర్ సుమ మాట్లాడుతూ మలేరియా రహిత సమాజం మనందరి లక్ష్యంగా పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

కోనాం సంతలో జోరుగా చింతపండు విక్రయాలు



రైతులు విక్రయానికి తెచ్చిన చింతపండు

చీడికాడ, ఏప్రిల్ 25 : చింతపండుకు కాస్త గిరాకీతో పాటు ధర కూడా పెరగడంతో మండలంలోని కోనాం సంతకు వచ్చిన గిరిజన రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. కోనాం పంచాయతీతో పాటు పాడేరు, మాడుగుల, హుకుంపేట, అనంతగిరి మండలాలకు చెందిన వివిధ గిరిజన గ్రామాల నుండి భారీగా చింతపండును గిరిజనులు కావిళ్ల ద్వారా సంతకు తీసుకు వచ్చారు. అయితే బుధవారం సాయంత్రం మాడుగుల, చీడికాడ మండలాల్లో వర్షం కురవడంతో గురువారం వాతావరణం చల్లబడింది. దీంతో వ్యాపారులు సైతం పెద్దసంఖ్యలో వచ్చి పోటీపడిమరీ కొనుగోలుచేశారు. మధ్యాహ్నం ఒంటి గంటకల్లా అమ్మకాలు పూర్తయ్యాయి. ఇదిలా వుంటే, గతవారం కిలో చింతపండు రూ.40నుంచి రూ.45 అమ్మగా, ఈ వారం రూ.45 నుంచి రూ.50 పలకడంతో రైతులు కూడా ఆనందం వ్యక్తం చేశారు.

నామినేషన్లకు తెర.. ఇక ప్రచార జాతర

▸▸ నర్సీపట్నంలో ఏడుగురు అభ్యర్థులు.. 22 సెట్లు ▸▸ చోడవరంలో 10 మంది అభ్యర్థులు.. 15 సెట్లు.. ▸▸ మాడుగులలో 14మంది అభ్యర్థులు 29 సెట్లు దాఖలు



చోడవరంలో టీడీపీ అభ్యర్థిగా రాజు నామినేషన్‌కు ర్యాలీగా వెళుతున్న కూటమి నాయకులు, కార్యకర్తలు

నర్సీపట్నం, ఏప్రిల్ 25 : నామినేషన్ల ఘట్టం గురువారం ముగిసింది. ఇక ప్రచార హోరు సాగనుంది. నర్సీపట్నం నియోజవర్గం ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీకి స్వతంత్ర అభ్యర్థులతో సహా ఏడుగురు 22 సెట్ల నామినేషన్ పత్రాలు దాఖలు చేశారు. సార్వత్రిక ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ ఈ నెల 18 తేదీన మొదలైన విషయం తెలిసిందే. టీడీపీ, వైసీపీ, కాంగ్రెస్, బీఎస్పీ, భారత చైతన్య యువజన పార్టీ, జై భీంరావు భారత్ పార్టీలతో పాటు ఇద్దరు స్వతంత్ర అభ్యర్థులు నామినేషన్లు వేశారు. టీడీపీ అభ్యర్థిగా చింతకాయల అయ్యన్నపాత్రుడు మూడు సెట్లు నామినేషన్ పత్రాలు దాఖలు చేశారు. డమ్మీ అభ్యర్థిగా ఆయన చిన్న కుమారుడు చింతకాయల రాజేశ్ రెండు సెట్లు వేశారు. వైసీపీ అభ్యర్థిగా పెట్ల ఉమాశంకర్ గణేశ్ నాలుగు సెట్లు, డమ్మీ అభ్యర్థిగా ఆయన భార్య కళావతి నాలుగు సెట్లు నామినేషన్ పత్రాలు అందజేశారు. కాంగ్రెస్ అభ్యర్థిగా రుత్తల శ్రీరామ మూర్తి రెండు సెట్లు, బీఎస్పీ అభ్యర్థిగా బొట్టా నాగరాజు రెండు సెట్లు నామినేషన్లు వేశారు. జైభీంరావు భారత్ అభ్యర్థిగా నేతల నాగేశ్వరరావు, భారత చైతన్య యువజన పార్టీ అభ్యర్థిగా జోగా చంద్రమౌళి ఒక్కొక్కటి చొప్పున నామినేషన్ సెట్లు అందజేశారు. స్వతంత్ర అభ్యర్థులుగా బయపురెడ్డి భద్రాచలం రెండు సెట్లు, పైలా సూర్యగణేశ్ ఒక సెట్టు నామినేషన్ వేశారు. ఇద్దరు స్వతంత్ర అభ్యర్థులతో సహా ఏడుగురు అభ్యర్థులు, ఇద్దరు డమ్మీ అభ్యర్థులు కలిపి 22 సెట్లు నామినేషన్లు వేశారు. ఈ నెల 29 మధ్యాహ్నం మూడు గంటల వరకు అభ్యర్థుల నామినేషన్లు ఉప సంహకరణకు గడువు ఉన్నట్టు ఆర్‌వో జయరాం తెలిపారు.

చోడవరం: నియోజకవర్గంలో నామినేషన్లు ముగిసేనాటికి మొత్తం 15 నామినేషన్లు దాఖలయ్యాయి. టీడీపీ నుంచి ఐదు సెట్ల నామినేషన్లు, వైసీపీ నుంచి నాలుగు, కాంగ్రెస్ నుంచి రెండు, బీఎస్‌పీ నుంచి ఒకటి, సీపీఎం(ఎల్) నుంచి ఒకటి, ఇండిపెండెంట్లు ఇద్దరు నామినేషన్లు దాఖలయ్యాయి. టీడీపీ అభ్యర్థిగా మాజీ ఎమ్మెల్యే కేఎస్‌ఎన్‌ఎస్ రాజు, ఆయనకు డమ్మీగా గూనూరు మల్లునాయుడుల నుంచి ఐదు నామినేషన్లు పడ్డాయి. వైసీపీ తరపున ప్రభుత్వ విప్ ధర్మశ్రీ, ఆయనకు డమ్మీగా భార్య వెంకటలక్ష్మి పేరు మీద కలిపి నాలుగు నామినేషన్లు దాఖలు చేశారు. ఇక కాంగ్రెస్ అభ్యర్థిగా జగతా శ్రీనివాసరావు రెండు సెట్లు, సీపీఐఎంఎల్ లిబరేషన్ పార్టీ అభ్యర్థిగా సవరాల గణేష్ నామినేషన్ దాఖలు చేశారు.

మాడుగుల : నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థులుగా 14 మంది 29 నామినేషన్లు దాఖలు చేసినట్టు ఆర్‌వో సత్యవాణి తెలిపారు. టీడీపీ అభ్యర్థిగా బండారు సత్యనారాయణమూర్తి నాలుగు సెట్లు, ఆయనకు డమ్మీగా అతని భార్య మాధవీలత ఒక నామినేషన్ వేశారు. అలాగే పైలా ప్రసాదరావు రెండు సెట్లు, ఆయన సోదరుడు పైలా ఈవీఎస్ నాయుడు డమ్మీ అభ్యర్థిగా ఒక సెట్ నామినేషన్ వేశారు. బూడి ముత్యాలనాయుడు కుమార్తె ఈర్లె అనురాధ వైసీపీ అభ్యర్థిగా నాలుగు సెట్లు నామినేషన్ వేశారు. బూడి భార్య రమణమ్మ మూడు సెట్లు నామినేషన్ వేశారు. బూడి కుమారుడు బూడి రవికుమార్ స్వతంత్ర అభ్యర్థిగా రెండు సెట్లు నామినేషన్ వేశారు. కాంగ్రెస్ అభ్యర్థిగా బొడ్డు శ్రీనివాస్ మూడు సెట్లు, బహుజన్ సమాజ్ వాదీ పార్టీఅభ్యర్థిగా కరణం తిరుపతిరావు రెండు సెట్లు నామినేషన్ వేశారు. స్వతంత్ర అభ్యర్థులుగా లెక్కల ఈశ్వరరావు, మతల ఆదినాయుడు, తాళ్ల రవికుమార్, మల్లారపు లోవ(ప్రబుద్ధ రిపబ్లిక్ పార్టీ) ఒక్కొక్క నామినేషన్ వేశారు. కాగా మాజీ ఎమ్మెల్యే గవిరెడ్డి రామానాయుడు స్వతంత్ర అభ్యర్థిగా ఒక సెట్ సమర్పించారు. మాజీ ఎమ్మెల్యే గవిరెడ్డి రామానాయుడు స్వతంత్ర అభ్యర్థిగా నామినేషన్ వేశారు.

రాష్ట్రాభివృద్ధికి టీడీపీని గెలిపించండి : అయ్యన్న



వల్సంపేటలో ప్రచారం నిర్వహిస్తున్న అయ్యన్నపాత్రు

నాతవరం, ఏప్రిల్ 25 : రాష్ట్రాభివృద్ధికి ఈ ఎన్నికల్లో ప్రజలంతా టీడీపీని గెలిపించి, చంద్రబాబునాయుడును ముఖ్యమంత్రి చేయాలని మాజీ మంత్రి చింతకాయల అయ్యన్నపాత్రుడు కోరారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా మండలంలోని వల్సంపేటలో గురువారం రాత్రి పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రవేశపెట్టనున్న పథకాలను వివరించారు. వైసీపీ ఐదేళ్ల పాలనలో రాష్ట్రం అన్నిరంగాల్లో నష్టపోయిందన్నారు. ఓటర్లంతా విజ్ఞతతో ఆలోచించి టీడీపీ, జనసేన బీజేపీ కూటమిని గెలిపించాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ కరక సత్యనారాయణ, టీడీపీ మండల అధ్యక్షుడు నందిపల్లి వెంకటరమణ, జనసేన నాయకుడు వీర సూర్యచంద్రం తదితరులు పాల్గొన్నారు.

మాడుగులను పారిశ్రామికంగా అభివృద్ధి చేస్తా : బండారు



వెంకటరాజపురంలో ప్రచారం నిర్వహిస్తున్న బండారు

దేవరాపల్లి, ఏప్రిల్ 25 : ఎన్నికల్లో తనను గెలిపిస్తే నియోజకవర్గాన్ని పారిశ్రామికంగా అభివృద్ధి చేయడంతో పాటు సాగునీటి ప్రాజెక్టుల అభివృద్ధికి కృషి చేస్తానని టీడీపీ మాడుగుల ఎమ్మెల్యే అభ్యర్థి బండారు సత్యనారాయణ మూర్తి అన్నారు. వెంకటరాజపురం, వాకపల్లి గ్రామాల్లో గురువారం రాత్రి ప్రచారం నిర్వహించారు. చంద్రబాబు ప్రవేశపెట్టిన సూపర్ సిక్స్ పథకాలను వివరించారు. ఎంపీ అభ్యర్థి సీఎం రమేష్‌ను కమలం గుర్తుపై, సైకిల్ గుర్తుపై తనకు ఓటువేసి గెలిపించాలని కోరారు. నియోజకవర్గ ఇన్‌చార్జ్ పీవీ జీకుమార్, నాయకులు సూర్యనారాయణలు, పోతల పాత్రునాయుడు, దాలిబాబు, వెంకటేష్, చల్లా నానాజీ పాల్గొన్నారు.

చీడికాడ : ఓటర్లంతా కూటమికి పట్టంకట్టాల్సిందిగా టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి బండారు సతీమణి మాధవీలత కోరారు. జి.కొత్తపల్లి, చినగోగాడ గ్రామాల్లో గురువారం ఉపాధి కూలీలతో ఆమె సమావేశమయ్యారు. ఎంపీ అభ్యర్థిగా సీఎం రమేష్‌కు కమలం గుర్తుపై, ఎమ్మెల్యే అభ్యర్థిగా బండారు సత్యనారాయణమూర్తికి సైకిల్ గుర్తుపై ఓట్లు వేసి గెలిపించాల్సిందిగా విజ్ఞప్తి చేశారు. మాజీ జడ్పీటీసీ పోతల రమణమ్మ, సర్పంచ్ కొల్లి సూరినాయుడు, మాజీ సర్పంచ్‌లు బండారు తాతబాబు, గండి లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

చోడవరం బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా డేవిడ్



బార్ అసోసియేషన్ అధ్యక్షుడిని అభినందించిన న్యాయవాదులు

చోడవరం, ఏప్రిల్ 25 : స్థానిక బార్ అసోసియేషన్ కార్యవర్గం నూతన అధ్యక్షునిగా కాండ్రేగుల డేవిడ్ తిరిగి ఎన్నికయ్యారు. గురువారం బార్ అసోసియేషన్‌కు నిర్వహించిన ఎన్నికల్లో ఇప్పటి వరకూ అధ్యక్షుడిగా పనిచేసిన డేవిడ్ మళ్లీ విజయం సాధించారు. మిగిలిన కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అసోసియేషన్ ప్రధాన కార్యదర్శిగా గొర్లె కృష్ణవేణి, ఉపాధ్యక్షులుగా శ్రీనాధు ప్రసాదరావు, సహాయ కార్యదర్శిగా బోలే పైడిరాజు, కోశాధికారిగా ఆర్ఎస్ఎన్ ప్రసాద్, స్పోర్ట్సు కార్యదర్శిగా వారాధి రాజు, లైబ్రరీ కార్యదర్శిగా దొగ్గ శివప్రసాద్‌లు ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారులుగా డీవీవీ సాంబమూర్తి, కందర్ప భవానీశంకర్‌లు వ్యవహరించారు. ఇదిలావుంటే, అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని సభ్యులంతా అభినందనలతో ముంచెత్తారు.

జిల్లాకు ముగ్గురు ఎన్నికల పరిశీలకుల నియామకం

... 1వ పేజీ తరువాయి

సంబంధించిన ఫిర్యాదులు, వినతులు వారికి సమర్పించవచ్చునని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి తెలిపారు. అనకాపల్లి పట్టణంలోని గుండాల జంక్షన్‌లో గల ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా కేంద్రంలో దల్జీత్‌సింగ్‌మంగత్ అందుబాటులో ఉంటారని కలెక్టర్ తెలిపారు.

గ్రామాల్లో ఘనంగా అమ్మవార్ల పండగ



ఎరకన్న పాలెంలో కొలువుదీరిన మరిడిమాంబ

మాకవరపాలెం, ఏప్రిల్ 25 : మండలంలోని పలు గ్రామాల్లో గురువారం అమ్మవార్ల పండగను ఘనంగా నిర్వహించారు. భీమబోయినపాలెంలో మరిడిమాంబ, రామన్నపాలెంలో బండితల్లి, ఎరకన్నపాలెంలో మరిమాంబ, కొత్తపాలెంలో మరిడిమాంబ వేడుకల సందర్భంగా ఆయా గ్రామాలు సందడిగా మారాయి. వేకుజాము నుంచి అమ్మవార్ల దర్శనాలకు భక్తులు పోటెత్తారు. నిర్వాహకులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

నిండా ముంచిన వైసీపీ

... 1వ పేజీ తరువాయి

మూలన పడింది. తరువాత వచ్చిన వైసీపీ ప్రభుత్వం దీనిని వర్చువల్ పద్ధతిలో మూడుసార్లు శంకుస్థాపన చేసింది. అయితే ఇప్పటి వరకు పునాది రాయి కూడా పడలేదు. అలాగే తాము అధికారంలోకి వస్తే సెజ్ కర్మాగారాల్లో 75 శాతం ఉద్యోగాలు స్థానికులకే ఇస్తామని అప్పట్లో జగన్మోహన్‌రెడ్డి ప్రకటించారు. స్థానికుల మాటెలా ఉన్నా కనీసం నిర్వాసితులకు కూడా ఉపాధి అవకాశాలు కల్పించలేదు. గత ఎన్నికల సమయంలో వైసీపీ మాటలు విని నిండా మునిగామని పూడిమడక మత్స్యకారులతో పాటు నిర్వాసిత రైతులు కూడా ఆవేదన చెందుతున్నారు.

చోడవరం టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా
కేఎస్‌ఎన్‌ఎస్ రాజు నామినేషన్

చోడవరం, ఏప్రిల్ 25 : నియోజకవర్గ కేంద్రం చోడవరం గురువారం పసుపుమయంగా మారింది. నాలుగు మండలాల నుంచి భారీగా తరలివచ్చిన టీడీపీ, జనసేన బీజేపీ నాయకులు, కార్యకర్తలతో కోలాహల వాతావరణం నెలకొంది. వీరందరితో భారీ ర్యాలీగా వెళ్లి చోడవరం టీడీపీ అభ్యర్థిగా కేఎస్‌ఎన్‌ఎస్ రాజు తన నామినేషన్ పత్రాన్ని ఆర్‌వో చిన్నికృష్ణకు సమర్పించారు. కూటమి అనకాపల్లి ఎంపీ అభ్యర్థి సీఎం రమేష్ హాజరు కావడంతో కార్యకర్తల్లో రెట్టించిన ఉత్సాహం కనిపించింది. టీడీపీ జిల్లా అధ్యక్షుడు బత్తుల తాతయ్యబాబు, తెలుగురైతు రాష్ట్ర ఉపాధ్యక్షుడు మల్లునాయుడు, జనసేన నాయకులు పీవీఎస్ఎన్ రాజు, బీజేపీ నాయకులు ఈర్లె శ్రీరామమూర్తి, కూటమి నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

గ్రామాల్లో ఎమ్మెల్యే గణేశ్ ప్రచారం

నాతవరం, ఏప్రిల్ 25 : మండలంలోని పి.జగ్గంపేట, పి.కె.గూడెం, గుమ్మిడిగొండ తదితర గ్రామాల్లో ఎమ్మెల్యే గణేశ్ గురువారం ప్రచారాన్ని నిర్వహించారు. ఈ ఐదేళ్ల కాలంలో నియోజకవర్గంలో చేపట్టిన అభివృద్ధిని చూసి తనను గెలిపించాల్సిందిగా కోరారు. ఎంపీపీ లక్ష్మణమూర్తి, వైస్ ఎంపీపీలు షైనం నాగవెంకటగోపి, పైల సునీల్, వైసీపీ నాయకులు లగుడు నాగేశ్వరరావు, బండారు నాయుడు తదితరులు పాల్గొన్నారు.

మత్స్యకారుడి కుటుంబానికి ఆర్థిక సాయం



మృతుని కుటుంబానికి సాయం అందిస్తున్న ప్రతినిధులు

గొలుగొండ, ఏప్రిల్ 25 : తాండవ రిజర్వాయర్‌లో ఇటీవల బోటు ప్రమాదంలో మృతి చెందిన మత్స్యకారుడి కుటుంబానికి పీఆర్‌టీయూ మండల ప్రతినిధులు బాసటగా నిలిచారు. ఈ మేరకు మృతిని కుటుంబానికి గురువారం రూ.అరవై వేల ఆర్థిక సాయాన్ని అందించారు. మండలంలోని పొగచెట్లపాలేనికి చెందిన గరగల అప్పారావు ఇటీవల తాండవ రిజర్వాయర్‌లో చేపల వేటకు వెళ్లి బోటు ప్రమాదంలో మృతి చెందిన సంగతి తెలిసిందే. మృతుడికి ముగ్గురు ఆడ పిల్లలు ఉన్నారు. ఈ కుటుంబ పరిస్థితిని గుర్తించిన యూనియన్ ప్రతినిధులు ఈ మేరకు సాయాన్ని అందించారు. పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు డి.గోపీనాథ్, గౌరవాధ్యక్షుడు కురస వెంకటరమణ, గొలుగొండ మండల శాఖ అధ్యక్షుడు గండేపల్లి శ్రీరామ్మూర్తి, కార్యదర్శి రమణమూర్తి, ఉపాధ్యాయులు శివకేశవరావు, కన్నంరెడ్డి, లోవరమేష్ తదితరులు పాల్గొన్నారు.

Format C-1
(for candidate to publish in newspapers, TV)
Declaration about Criminal Cases

(As per the judgement dated 25th September , 2018, of honourable Supreme Court in WP (Civil) no.536 of 2011 (Public interest Foundation & Ors. Vs. Union of India & Anr.)

Name of address of candidate : **Sri Bandaru Satyanarayana Murthy,** D-No: 8-84, Vennalapalem Village, Parawada Mandal, Anakapalli District

Name Of The political Party : **Telugudesam Party**

(Independent Canditate should Write "Independent" here.

Name Of Election : **General elections 2024 to Andhra Paradesh State**

Name of Constituency : **27- Madugula Assembly Constituency**

I, **BANDARU SATYANARAYANA MURTHY** a candidate for the above mentioned election, declare for public information the following details above my criminal antecedents.

(A) Pending Criminal Cases

Sl. No	Name of Court	Case No. and Dated	Status of Case	Present stage of case
01	NIL	Fir No.400/023 of Arundalpet P.S, dt.01/10/2023	Under section153a, 294,504,505 IPC, 67 ITA-2000-2008	Alleged that the complaintant watching that, youtube videos he found that ex-minister bandaru Satyanarayana murthy, speaks against the arrest of Ex. CM Nara Chabdrababu Naidu at that time. The accused speaks vulgar words to CM Y.S. Jagan Mohan Reddy
02	NIL	FIR NO.354/2023 of Nagarapalem P.S.Guntur dated 01/10/2023	Under section 153a, 354(a),504,505,506, 509,499IPC,67 ITA-2000-2008	Alleged that the accused made made comments against the Smt.Roja, Minister of tourism and youth advance of A.P. false comments basing on the social media
03	NIL	FIR NO.12/2023 of Cyber Crime CID-2, Vijayawada dated 30/09/2023	Under section 153a, 504,505(2),506,509, R/W 120b IPC, 67ITA-2000-2008	Alleged that the accused made comments against Smt.Roja, Minister of tourism and publicity of A.P. insulted her and also provoked committed an offence with criminal intimidation
04	CC 4251/2020 III metropolitan magistrate court Visakhapatnam	Fir no.74/2020 of Pendurthy P.S. Visakhapatnam dated 17/02/ 2020	Under Section 341, 353 r/w 34 IPC	Accused and others obstructed the MRO and VRO their duties in pinagadi Village, at the time of removing the encroachments in government land
05	NIL	Fir No. 32/2009 of Sabbavaram P.S. Anakapalli (Visakhapatnam) dated.22/02/	Undersection 323, 34 IPC, SC-ST ACT 1989	Accused and his associates with hands and insulted them for their low caste and while they were returning from the C.M. Andhra Pradesh public meeting at NTR Junction Sabbavaram.
06	Judicial first class magistrate cum junior civil judge at Nagari, Chittor (Private Case)	NIL	Under section 499, 500 IPC	NIL

(B) Details about cases of conviction for Criminal Offences

Sl.	Name of Court & Date(s) of Order	Description of offices(s) & punisgment imposed	Maximum punishment imposed
01	NIL	NIL	NIL

Sd/- **BANDARU SATYANARAYANA MURTHY**
MLA Contesting Candidate, Madugula
Andhra Pradesh state legislative assembly-2024

పేదోడి పొట్టకొట్టిన వైసీపీ

... 1వ పేజీ తరువాయి

దాల్సలేదు. అయితే తమకు నామమాత్రపు ధరకు నాణ్యమైన ఆహారాన్ని అందించిన అన్న క్యాంటీన్లను రద్దు చేసి తమ కడుపు కొట్టారంటూ వైసీపీ ప్రభుత్వాన్ని నిరుపేదలు ఇప్పటికీ తూర్పారబడుతుంటారు.

వైసీపీ అధికారంలోకి వచ్చిన మూడు నెలలకే మూత

నర్సీపట్నం: వైసీపీ అధికారంలోకి వచ్చిన మూడు నెలలకే అన్న క్యాంటీన్లు మూతపడ్డాయి. నర్సీపట్నం ఏరియా ఆస్పత్రి ఎదురుగా ఉన్న అన్న క్యాంటీన్ భవనం ప్రస్తుతం నిరుపయోగంగా ఉంది. భవనంలో చెత్తాచెదారం పేరుకుపోయింది. చాలా సామగ్రి అపహరణకు గురైంది. గతంలో ఇక్కడ ప్రతీ రోజు అల్పాహారం 350 మందికి, మధ్యాహ్నం భోజనం 350, రాత్రి భోజనం 250 మందికి వడ్డించేవారు. అన్న క్యాంటీన్ ప్రారంభం నాటి నుంచి వైసీపీ ప్రభుత్వం మూసేసే వరకు సెలవురోజులు పోను అల్పాహారం 54,969 మందికి, మధ్యాహ్నం భోజనం 59,575 మందికి, రాత్రి భోజనం 34,520 మందికి వడ్డించారు.

అనకాపల్లిలో..

అనకాపల్లి టౌన్: టీడీపీ ప్రభుత్వ హయాంలో 2018 జూలై 11వ తేదీన అనకాపల్లి పట్టణంలోని ఎన్టీఆర్ వైద్యాలయం ఆవరణ, రైల్వేస్టేషన్ ప్రధాన మార్గం వద్ద అన్న క్యాంటీన్‌లను ప్రారంభించారు. ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం, రాత్రి ఐదేసి రూపాయల చొప్పున ఆహారం అందుబాటులో ఉండేది. ఇక్కడ ఉదయం 300 నుంచి 350 మంది, మధ్యాహ్నం 500 నుంచి 600 మంది, రాత్రి వేళ 300 నుంచి 400 మంది భోజనాలు చేసేవారు. అలాగే రైల్వేస్టేషన్ వద్ద అన్న క్యాంటీన్‌లో రిక్షా కార్మికులు, దూర ప్రాంతాలకు కూలీ పనులకు వెళ్లే వ్యవసాయ కూలీలు భోజనాలు చేసేవారు. అయితే వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక 2019 ఆగస్టులో అన్న క్యాంటీన్లు మూసివేశారు.

పీహెచ్‌సీల్లో కుటుంబ సంక్షేమ శస్త్ర చికిత్సలు

మాకవరపాలెం, ఏప్రిల్ 25 : ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో కుటుంబ సంక్షేమ శస్త్రచికిత్సలు చేయడం ప్రారంభించినట్టు మాకవరపాలెం పీహెచ్‌సీ వైద్యాధికారిణి డాక్టర్ సీతామహాలక్ష్మి తెలిపారు. గురువారం విలేకరులతో మాట్లాడుతూ గత మూడేళ్ల నుంచి పీహెచ్‌సీల్లో ఈ శస్త్ర చికిత్సలు జరగడం లేదన్నారు. దీంతో ఈ ఆపరేషన్ల కోసం నర్సీపట్నం ఏరియా ఆస్పత్రికి వెళ్లాల్సి వచ్చేదన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మాకవరపాలెం, బూరుగుపాలెం పీహెచ్‌సీల్లోని ఆపరేషన్ల థియేటర్లు సిద్ధం చేసి ఆపరేషన్లు ప్రారంభించినట్టు చెప్పారు. నర్సీపట్నం ఏరియా ఆసుపత్రి సివిల్ సర్జన్ డాక్టర్ లక్ష్మణరావు ఆధ్వర్యంలో మాకవరపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఐదుగురికి ఈ ఆపరేషన్లు చేసినట్టు ఆమె వివరించారు.

గొలుగొండ మండలంలో ఈదురు గాలులతో భారీ వర్షం



గొలుగొండ మండలం కృష్ణాదేవిపేటలో భారీగా వర్షం కురుస్తున్న దృశ్యం

కృష్ణాదేవిపేట, ఏప్రిల్ 25 : వాతావరణంలో మార్పుల కారణంగా గొలుగొండ మండలంలో గురువారం సాయంత్రం ఈదురు గాలులతో భారీ వర్షం కురిసింది. దీంతో ఉదయం నుంచి ఎండకు అల్లాడుతున్న ప్రజానీకం ఉపశమనం పొందారు. ఏఎల్‌పురం, కొంగశింగి, చోద్యం, సీహెచ్.నాగాపురం, లింగంపేట, పాతకృష్ణాదేవిపేట తదితర గ్రామాల్లో ఎటుచూసినా నీరే కనిపించింది. ముఖ్యంగా మేజర్ పంచాయతీ ఏఎల్‌పురంలో వర్షపు నీరు ఎటూ పోలేని దుస్థితి నెలకొనడంతో గొల్లవీధి, వినాయక కాలనీ, బీసీకాలనీలలో సీసీ రోడ్లపైకి నీరు చేరింది. దీనికి మురుగు నీరు తోడవ్వడంతో మరింత దారుణంగా తయారయ్యాయి. ఈ వర్షం జీడిమామిడి తోటలకు ఎంతగానో మేలు చేస్తుందని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ఇదిలావుంటే, వర్షం కారణంగా విద్యుత్ సరఫరాకు గంటల తరబడి అంతరాయం ఏర్పడింది.

మాడుగుల మండలంలో..

మాడుగుల రూరల్ : మండలంలో గురువారం సాయంత్రం మోస్తరు వర్షం పడడంతో వాతావరణం చల్లబడింది. ఉదయం నుంచి మధ్యాహ్నం మూడున్నర గంటల వరకు ఎండధాటి కొనసాగింది. దీంతో పన్నెండు గంటల ప్రాంతంలో చాలా వరకు రోడ్లు నిర్మానుష్యంగా కనిపించాయి. ఆ తరువాత ఆకాశం మేఘావృతమై వర్షం పడింది. దీంతో బుధ, గురువారాల్లో కురిసిన వర్షాలకు అంతటా చల్లబడడంతో జనం ఉక్కపోత నుంచి ఉపశమనం పొందారు.